teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 249 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 11 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## 1989 - 90 బ్యాచ్‌కు చెందిన పోలీసులకు పదోన్నతులు

**187 ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ప్రమోషన్స్**

**ఈ మేరకు డీజీపీ ఆదేశాలు జారీ**




హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండుగ సమీపిస్తోన్న వేళ ఏఎస్ఐలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 1989, 1990 బ్యాచ్‌కు చెందిన పోలీసులకు పదోన్నతి కల్పించింది. హైదరాబాద్ రీజియన్‌లోని 187 ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ప్రమోషన్ ఇచ్చింది. ఈ మేరకు డీజీపీ జితేందర్ ఆదేశాలకు మేరకు ప్రమోషన్లు ఇస్తూ మల్టీ జోన్ - 2 ఐజీపీ సత్యనారాయణ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆ 187 మంది ఏఎస్సైలు తాజాగా ప్రీ ప్రమోషనల్ ట్రైనింగ్ పూర్తి చేసినట్లు సమాచారం. ట్రైనింగ్ పూర్తయిన వెంటనే వారికి పదోన్నత్తులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




రాష్ట్రంలో అమలుకానున్న

# ‘వన్ స్టేట్ వన్ రేషన్’



## ఇకపై ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు

**రేషన్ కార్డు లబ్దిదారుల జాబితా బహిర్గతానికి ఆదేశం**

**ఈ నెల 24లోగా గ్రామ సభలు పూర్తి చేయాలి : సీఎం రేవంత్**



02

**2050 వరకు హైదరాబాద్ అవసరాలకు తగ్గట్టుగా చేస్తాం**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



02

**వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌ల జత**

ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు కలిపి 20 కోచ్‌లతో వందేభారత్

## పన్నుల్లో వాటా.. రాష్ట్రాలకు కేంద్రం నిధుల విడుదల

**రూ.1,73,030 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ**

**తెలంగాణకు రూ.3,637 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7002 కోట్లు**



తెలంగాణ బ్యూరో, జనవరి 10 (తీన్మార్ న్యూస్): దేశంలోని వివిధ రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త చెప్పింది. పన్నుల్లో వాటా కింద శుక్రవారం రాష్ట్రాలకు నిధులు విడుదల చేసింది. మొత్తం రూ.1,73,030 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3,637 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7002 కోట్లు,

మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

సొంతూళ్లకు పయనమైన నగర వాసులు

టోల్ ప్లాజాల వద్ద బారులు తీరిన వాహనాలు

విద్యాసంస్థలకు ప్రకటించిన సెలవులు



02

## కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

**ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం సీరియస్**

**గంటకు పైగా కొనసాగిన సమావేశం**

**ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ, భరోసాపై చర్చ**



హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లతో భేటీ గంటకు పైగా కొనసాగింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలో వరుస ఫుడ్ పాయిజన్

మిగతా 2 లో



## ఇకపై నెలకు వెయ్యి ఉద్యోగాలు ఇస్తాం

**నిరుద్యోగరహిత నియోజకవర్గంగా మల్కాజ్ గిరిని చేస్తాం**

**పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ప్రకటన**

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ఇకపై నెలకు వెయ్యి ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ రహిత పార్లమెంట్ నియోజకవర్గంగా మల్కాజ్ గిరిని తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. నిరుద్యోగరహిత మల్కాజ్ గిరి పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా శామీర్ పేటలోని తన నివాసంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ తన 25 ఏళ్ల

మిగతా 2 లో

## సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్ సహా ప్రధాన నగరాల ప్రత్యేక సర్వీసులు**

**ఈ మేరకు టీజీఎస్ ఆర్టీసీ ప్రకటన**



హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండగకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బస్సులు నడుపుతుంది. హైదరాబాద్ సహా ప్రధాన నగరాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు, 16 నుంచి 20వ తేదీన వరకు ప్రత్యేక బస్సులు

మిగతా 2 లో



## హైకోర్టును ఆశ్రయించిన హరీష్‌రావు

ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ పిటిషన్


మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోన్ టాపింగ్ కేసులో హైకోర్టు విచారణ జరిపింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు

మిగతా 2 లో

## రైలు చక్రాలను తయారు చేయనున్న భారత్ : రైల్వే మంత్రి

న్యూ ఢిల్లీ, జనవరి 10 (తీన్మార్ న్యూస్): 2026 నుంచి మేక్ ఇన్ ఇండియా పథకం కింద రైళ్లకు చక్రాలను ప్రైవేట్ సంస్థల సహకారంతో తయారు చేస్తామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రామకృష్ణ ఫోర్జింగ్స్ లిమిటెడ్, టిటాగఢ్ రైల్ సిస్టమ్స్ కంపెనీలోని చక్రాల తయారీ యూనిట్‌ను సందర్శించిన సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. తమిళనాడులోని



మిగతా 2 లో




## ఆదివాసీల కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్

సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ఆదివాసీల కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులతో రేవంత్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ బీజేపీ అధిష్టానం దూకుడు

**అన్ని పార్టీల కంటే ముందే ముగ్గురు అభ్యర్థుల ప్రకటన**

**రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాబితా విడుదల**



హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ తెలంగాణ బీజేపీ అధిష్టానం దూకుడు పెంచింది. అన్ని పార్టీల కంటే ముందే మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం

మిగతా 2 లో

# రాష్ట్రంలో అమలుకానున్న 'వన్ స్టేట్ - వన్ రేషన్' విధానం







హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో 'వన్ స్టేట్ - వన్ రేషన్' విధానాన్ని అమలు చేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇకపై తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని ఆయన అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావలసిన ప్రిపరేటరీ పనులను పూర్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. రేషన్ కార్డు లబ్దిదారుల జాబితాలను కూడా గ్రామ సభల్లో బహిర్గతం చేయాలని, ఈ నెల 24వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేయాలని ఆదేశించారు. గూడులేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనేది ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా గుర్తించిన 18.32 లక్షల మంది వివరాలను జిల్లాలకు పంపించామని.. అందులో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. తొలి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన వారి జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని.. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అర్హుల జాబితాను జిల్లా ఇంచార్జ్ మంత్రికి అందించాలని పేర్కొన్నారు. ఇంచార్జ్ మంత్రి ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ధనసరి సీతక్క , ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి , ప్రభుత్వ సలహాదార్లు కే.కేశవరావు, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సులు



మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉండనున్నాయి. టీజీఎస్ ఆర్టీసీ 6,432 ప్రత్యేక బస్సులను నడపుతుంది. అయితే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు వెల్లడించింది. రోజు వారీగా నడిపే బస్సుల్లో అదనపు ఛార్జీలు ఏమీ ఉండవని ఆర్టీసీ తెలిపింది. సంక్రాంతి పండగ కోసం ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ 6,432 ప్రత్యేక బస్సులు నడుపుతుందని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికులకు అవసరమైన మరిన్ని బస్సులు నడపడానికి ఆర్టీసీ సిద్ధంగా ఉందని అన్నారు. మరోవైపు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలకు మంత్రి వార్నింగ్ ఇచ్చారు. పండగ సమయంలో ప్రయాణికుల వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తే బస్సులు సీజ్ చేస్తామన్నారు. ప్రయాణికులకు ఏ సమస్య వచ్చినా రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. పండగ పూట ప్రైవేట్ ట్రావెల్స్ ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు ఇచ్చారు.

## తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి



తెలంగాణ బ్యూరో, జనవరి 10 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి స్టార్ట్ అయ్యింది. హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు పయనమవుతున్నారు నగర వాసులు. విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో ఫెస్టివల్ కు కుటుంబ సభ్యులతో కలిసి తమ వాహనాల్లో వెళ్తున్నారు. వాహనాల రాకపోకలతో జాతీయ, రాష్ట్ర రహదారులు రద్దీగా మారాయి. టోల్ ప్లాజాల దగ్గర వాహనాలు క్యూ కట్టాయి. హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ పెరిగిపోయింది. రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రద్దీని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నప్పటికీ కార్లు, బస్సులు, ఇతర రవాణా వాహనాలు టోల్ ప్లాజాల వద్ద బారులు తీరుతున్నాయి. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చౌటుప్పల్ మండలం జాతీయ రహదారిపై, పంతంగి టోల్ ప్లాజా దగ్గర వాహనాల రద్దీ పెరిగింది. వాహనాలు నిలిచిపోయాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద 16 టోల్ గేట్లు ఉండగా విజయవాడ వైపు 10 టోల్ గేట్లను, హైదరాబాద్ వైపు 6 టోల్ గేట్లను తెరిచి వాహనాలను పంపిస్తున్నారు టోల్ సిబ్బంది. మరో వైపు నల్గొండ జిల్లా కేతపల్లి మండలం కొర్లపాడు టోల్ ప్లాజా దగ్గర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొర్లపాడు టోల్ ప్లాజా దగ్గర మొత్తం 12 టోల్ బూత్ లు ఉండగా విజయవాడ వైపు ఏడు టోల్ బూతులను తెరిచి వాహనాలను పంపిస్తున్నారు టోల్ ప్లాజా సిబ్బంది. సంక్రాంతి వాహనాల రద్దీ నేపథ్యంలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసింది టోల్ ప్లాజా యాజమాన్యం. అంబులెన్స్ ను క్రేన్ ను అందుబాటులో ఉంచారు టోల్ ప్లాజా సిబ్బంది. శాలిగౌరారం రూరల్ సిఐ కొండల్ రెడ్డి టోల్ ప్లాజా దగ్గర వాహనాల రద్దీని పర్యవేక్షిస్తున్నారు.

## రైలు చక్రాలను తయారు చేయనున్న భారత్ : రైల్వే మంత్రి



మొదటి పేజీ తరువాయి

తిరువళ్లూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో రైళ్ల కోసం 80 వేలకు పైగా హైపవర్ చక్రాలు రైల్వేశాఖకు అవసరమని చెప్పారు. ప్రపంచ నాణ్యమైన మెటీరియల్‌లను తయారు చేయడంలో శక్తిమంతమైన స్వావలంబన కలిగిన బలమైన భారతదేశాన్ని సృష్టించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన అన్నారు. భారత్‌లో తయారయ్యే చక్రాలను దేశంలోనే తయారయ్యే రైళ్లు, మెట్రో రైళ్లకు వినియోగించడమే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తామని చెప్పారు.

## కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

మొదటి పేజీ తరువాయి

ఘటనలపై సీఎం సీరియస్ అయ్యారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచినా ఇలాంటి ఘటనలు జరగడం ప్రభుత్వంకు చెడ్డపేరు తెస్తున్నాయని సీఎం అన్నారు. కలెక్టర్లు విజిట్ చేయకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణం అవుతున్నాయని తెలిపారు. ఇక నుంచి ప్రతీ వారం ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలో కలెక్టర్లు విజిట్ చేసి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. మరోవైపు సంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారుల వరకు చేరాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేర్చే బాధ్యత కలెక్టర్లదేనన్నారు. ప్రభుత్వంకు మంచి పేరు రావాలన్నా చెడ్డపేరు రావాలన్నా కలెక్టర్ల పనితీరు పైనే ఆధారపడి ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపికలో అత్యంత పారదర్శకంగా జరగాలి. కొంతమంది కలెక్టర్లు అసలు ఫీల్డ్ విజిట్ చేయడం లేదని సీఎం చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కూడా సరిగ్గా మానిటర్ చేయలేదు అలా అలసత్వంతో ఉన్న కలెక్టర్లపై వేటు తప్పదని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి తెలిపారు.

## ఆదివాసీల కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్



మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడారు గోండు భాషలో ప్రాథమిక విద్య అందించే విషయంపై స్టడీచేయాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ ప్రాంతాలకు ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యత తీసుకున్న తర్వాత తొలిసభను ఇంద్రవెల్లిలోనే నిర్వహించామని చెప్పారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపాన్ని స్మృతివనంగా మార్చాలని నిర్ణయించామని అన్నారు. ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. కొమురం భీమ్ వర్ధంతి, జయంతులను అధికారిక ఉత్సవంగా నిర్వహించాలని అధికారులను సీఎం అధికారులను ఆదేశించారు. ఆదివాసీ ప్రాంతాల్లో రాయి సెంటర్ల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఉద్యమ సమయంలో ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేస్తున్నట్టు సీఎం చెప్పారు. ఇందిర జల ప్రభ ద్వారా ఆదివాసీల భూముల సాగులోకి తెచ్చేందుకు ఇందిర జల ప్రభ ద్వారా మరిన్ని బోర్లు వేయించనున్నట్టు చెప్పారు. ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. విదేశాల్లో చదువుకునే ఆదివాసీ విద్యార్థులకు సంబంధించిపెండింగ్ ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ ను క్లియర్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించా రు. ఆదివాసీ గూడాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆదివాసీ రైతులు వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేందుకు చర్యలు తీసు కుంటామని చెప్పారు.

## ఇకపై నెలకు వెయ్యి ఉద్యోగాలు ఇస్తాం

మొదటి పేజీ తరువాయి

రాజకీయ జీవితంలో ప్రతి నిత్యం నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటున్నారని, కానీ అందరికీ ఉద్యోగ అవకాశాలు రావడం లేదన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు ప్రధాని నరేంద్ర మోడీ రూ. 4 లక్షల కోట్లను బడ్జెట్ లో పెట్టినట్లు వెల్లడించారు. తద్వారా యువతకు పని కలిపించాలని, దేశ నిర్మాణంలో భాగస్వామ్యులను చేయాలని ప్రధాని సంకల్పించారని అన్నారు. మల్కాజ్ గిరి లోక్ సభ పరిధిలోని కంటోన్మెంట్, కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్ గిరి, మేడ్చల్, ఉప్పల్, ఎల్బీనగర్ లతోపాటు హుజురాబాద్, గజ్వేల్ 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉద్యోగ కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటికీ సర్వే నిర్వహించి, నిరుద్యోగుల డేటా సేకరిస్తామని, వారికి ఎలాంటి ఉద్యోగాలు కావాలనే నివేదిక తయారు చేసి, ప్రతి నెలా వెయ్యికి తగ్గకుండా ఉద్యోగాలు కల్పించేందుకు నిపుణ ఎన్జీఓ సమన్వయంతో ఎంప్లాయ్‌మెంట్ సెల్ ను ప్రారంభిస్తున్నట్లు ఈటల ప్రకటించారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక కంపెనీలు ఉన్నాయని, వాటిల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి, నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా తయారు చేస్తానని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లను త్వరలోనే ఏర్పాటు చేస్తామని, ఇక్కడే కాకుండా విదేశాల్లో కూడా నర్సులు, ఇతర టెక్నికల్ ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు ఈటల పేర్కొన్నారు.



## 2050 వరకు హైదరాబాద్ అవసరాలకు తగ్గట్టుగా చేస్తాం



హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ఫోర్త్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కాలుష్య రహితంగా ఉంటుందని అన్నారు. 2050 వరకు హైదరాబాద్ సిటీ అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక వేత్తలు కలిసి వస్తే అద్భుతాలు సృష్టిద్దామని పిలుపునిచ్చారు. హైటెక్ సిటీలోని సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామన్నారు. న్యూయర్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి నగరాలతో ఫోర్త్ సిటీ పోటీ పడుతుందని చెప్పారు. ఇది దేశంలోనే గొప్ప నగరంగా ఉండబోతోందని అన్నారు. కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీలో 3,200 ఈవీ బస్సులను తీసుకువస్తున్నామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామని చెప్పారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి హైదరాబాద్ సిద్ధమవుతోందని, వరదలు లేని నగరంగా తీర్చిదిద్దాలనుకుంటున్నామని అన్నారు. మూసీ పునరుజ్జీవంతో 55 కిలోమీటర్ల మేర మంచినీరు ప్రవహిస్తుందని అన్నారు. హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ను అనుసంధానించే రేడియల్ రోడ్లు నిర్మించబోతున్నామని వెల్లడించారు ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా ఉండబోతుందని చెప్పారు. నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించామని అన్నారు. రాష్ట్రానికి తీరప్రాంతం లేనందున డ్రైపోర్టు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దీనిని బందరు పోర్టుతో అనుసంధానం చేస్తామని చెప్పారు. మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందాలని ,మార్కెట్లు స్వేచ్ఛగా పనిచేయాలని మేము కోరుకుంటున్నామని సీఎం చెప్పారు.

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌ల జత

సికింద్రాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): వందేభారత్ ప్రయాణీకులకు పండుగలాంటి వార్త. సంక్రాంతి ముందే వచ్చేసిందని చెప్పొచ్చు. జనవరి 11 నుంచి విశాఖపట్నం %-% సికింద్రాబాద్ %-% విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లను జత చేయనుంది దక్షిణ మధ్య రైల్వే. 20833-34 నెంబర్ గల విశాఖ-సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం 16 కోచ్‌లతో 1,128 ప్యాసింజర్ల సామర్థ్యంతో సేవలు అందిస్తుండగా నేటి నుంచి అనగా జనవరి 11న ఈ ట్రైన్ 1,414 ప్యాసింజర్ల సామర్థ్యంతో 20 కోచ్‌లతో పట్టాలెక్కనుంది. ప్రస్తుతం 16 కోచ్‌లు ఉన్న ఈ వందేభారత్‌లో రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్, 14 చైర్ కార్ కోచ్‌లు ఉన్నాయి. ఈ తరుణంలోనే రైలు స్థిరంగా 130 శాతం కంటే ఎక్కువ డిమాండ్‌తో నడుస్తోంది. ఈ రైలుకు ప్రయాణీకుల నుంచి విశేష ఆదరణ లభిస్తుండటంతో మరో 4 అదనపు కోచ్‌లతో పెంచాలని నిర్ణయించింది. తదనుగుణంగా, ఈ రైలును 2025 జనవరి 11 నుంచి ప్రస్తుత 16 కోచ్‌ల సామర్థ్యానికి బదులుగా 20 కోచ్‌ల సామర్థ్యంతో నడపాలని దక్షిణ మధ్య రైల్వే డిసైడ్ అయింది. నూతన సవరించిన కూర్పులో 1,336 మంది ప్రయాణికుల సామర్థ్యంతో 18 చైర్ కార్లు ఉండనుండగా 104 మంది ప్రయాణికుల సామర్థ్యంతో 02 ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు కలిపి మొత్తం 20 కోచ్‌లలో 1,440 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగి ఉంటుంది. కాగా, ప్రయాణీకులు ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ తెలిపారు.

## పన్నుల్లో వాటా.. రాష్ట్రాలకు కేంద్రం నిధుల విడుదల

మొదటి పేజీ తరువాయి

విడుదల చేసింది. మూలధన వ్యయం, అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా నిధుల కేటాయింపుపై తెలంగాణ ప్రభుత్వం అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు అధిక నిధులు కేటాయించి అందులో సగం కూడా తెలంగాణకు కేటాయించకపోవడంపై సీఎం సహా మంత్రులు కూడా మండిపడుతున్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి కూడా తెలంగాణ పట్ల కేంద్రం చిన్నచూపు చూస్తోందని కేంద్రంపై విమర్శలు చేస్తున్నారు. రాబోయే పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాల మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి, వారి అభివృద్ధి/సంక్షేమ సంబంధిత వ్యయాలకు ఆర్థిక సహాయం కోసం విడుదలు చేస్తున్నాం అని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ బీజేపీ అధిష్టానం దూకుడు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాబితా విడుదల చేశారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సరోత్తం రెడ్డి, కరీంనగర్ -మెదక్ -ఆదిలాబాద్ - నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్కా కొమరయ్య, కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా అంజిరెడ్డిని ప్రకటించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ఆదేశాలతో కిషన్‌రెడ్డి అభ్యర్థులను ప్రకటించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో బీజేపీ అధిష్టానం అప్రమత్తమైంది. మరోవైపు 12 జిల్లాల నుంచి ఓటు హక్కు కోసం మొత్తం 28వేల మందికి పైగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోగా, పరిశీలన అనంతరం మొత్తం 22,554 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను ఫైనల్ చేశారు.

## హైకోర్టును ఆశ్రయించిన హరీష్‌రావు

మొదటి పేజీ తరువాయి

నమోదు చేసిన సంగతి తెలిసిందే. స్థిరాస్తి వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీంతో పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించారు.

పోలీసులు దర్యాప్తు, అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. గత విచారణ సందర్భంగా హరీష్ రావును అరెస్ట్ చేయొద్దంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చిన హైకోర్టు. శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. చక్రధర్ గౌడ్ కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ 28వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు అప్పటి వరకు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మునక మునుగోడుతో మొదలైందా?

బిజెపి మాతృక 'భారతీయ జనసంఘ్' కార్యవర్గ సమావేశం, నేటికి యాభైయేడు ఏళ్ల కిందటే (1967) ఒక చరిత్రాత్మక సందేశాన్నిచ్చింది. 'పార్టీలో కొత్తవారి చేరిక, ఇతర పార్టీలతో కలిసి ఉమ్మడి ప్రభుత్వాలు ఏర్పాటు చేయటం వంటివి జరిగినపుడు% పార్టీలో కొత్తగా చేరేవారు, పాత నాయకుల మధ్య ఓ సంఘర్షణ, సమస్యలు తలెత్తడం ఉంటుంది. దాన్ని సంయమనంతో అధిగమించాలి' అని నిర్ణయించింది. అదే సందర్భంలో పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, 'అస్పృశ్యత నేరం, రాజకీయ అస్పృశ్యత అతిపెద్ద నేరం' అన్నారు. 'అటువంటి కలయికలు తప్పదు, అప్పుడు అందరూ కలిసి పని చేయాల్సిందే' అని వివరణాత్మకంగా ఆయన ఉద్బోధించారు. కొంచెం సర్దుబాట్లతోనయినా.. ఇదే విధానాన్ని పార్టీ నాయకత్వం ఇప్పటికీ దేశవ్యాప్తంగా అనుసరిస్తోంది. కానీ, ఆ విషయంలో వివాదమే తెలంగాణ బిజెపి విస్తరణలో తీవ్ర ప్రతిష్టంభనకు కారణమవుతోంది. ఈ సమస్యను అధిగమించలేక పార్టీ ఢిల్లీ నాయకత్వం అయోమయానికి గురవుతూ, తలపట్టుకుంటోంది. సమస్యలు సరే పరిష్కారాలు కావాలి! తెలంగాణలో బిజెపి పరిస్థితి బయటివారికే కాక అంతర్గతంగా పార్టీ శ్రేణులకూ విస్మయం కలిగిస్తోంది.ఎదిగే అవకాశం ఉండీ, విస్తరణలో వీడని ప్రతిష్టంభన ఏర్పడింది. ఓ పట్టాన తొలగటం లేదు. పార్టీ రాష్ట్ర కొత్త అధ్యక్ష నియామకమే జరగట్లేదు. సంస్థాగత ఎన్నికలకు దాన్ని ముడిపెట్టి ప్రస్తుతానికి సరిపెట్టారు. పాత కొత్త నాయకుల మధ్య ఘర్షణ వైఖరితో%ా% రాష్ట్రంలో సంస్థాగత ఎదుగుదల ఒకడుగు ముందుకి రెండడుగులు వెనక్కి పడుతోంది. బిజెపి ఎదుగుదలను వేరెవరో కాదు, పార్టీ సొంత నాయకత్వమే అడ్డుకుంటున్నట్టుందని వారి హితైషులు, శ్రేయోభిలాషులే సనుక్కుంటున్నారు. పార్టీ ఢిల్లీ నాయకత్వపు ద్వైదీభావం కూడా పార్టీ శ్రేణుల్నే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒకే విషయంలో రెండు విధాలుగా అంటే, ఒకసారి ఒకలా, మరోసారి ఇంకోలా వ్యవహరించడం వెనుక లాజిక్కేమిటో ఎవరికీ అంతుబట్టడంలేదు. పాత కొత్త నాయకుల మధ్య సయోధ్య కుదుర్చకుండా, మరో పక్క పార్టీ నేతలతో ఏ సంప్రదింపులు లేకుండా, మాటమాత్రంగానైనా చెప్పకుండా కొత్త వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న తీరు వింతగా ఉంటోంది. లాంఛనంగా పార్టీలోకైనా రాకముందే బయటి వారికి పదవులు కట్టబెట్టడం చూస్తుంటే%ా% ఢిల్లీ స్థానిక నాయకత్వం మధ్య సయోధ్య ఎంత గొప్పగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. తెలంగాణ బిసి నాయకుడు ఆర్.కృష్ణయ్య కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపి(రాజ్యసభ) స్థానం కట్టబెట్టడంలో అదే జరిగింది. వామపక్షవాదిగా ముద్రపడ్డ ప్రొ. నాగేశ్వర్‌ను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా కలుస్తారు. కానీ ప్రయత్నం మీద కూడా పార్టీ సానుభూతి పరులైన పారిశ్రామికవేత్తలు, సామాజిక కార్యకర్తలు ఒకోసారి కలువలేని పరిస్థితులుంటాయి. ఆర్.కృష్ణయ్య రాజకీయ నేపథ్యం చిత్రంగా ఉంటుంది. 2014లో తెలుగుదేశం తెలంగాణ సిఎం అభ్యర్థిగా ప్రచారం పొంది, ఎల్‌బి నగర్ నుంచి ఎంఎల్‌ఏగా గెలిచారు. తర్వాత అయిదేళ్లు ఏనాడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని, పార్టీ కార్యాలయానికీ వచ్చేవారు కాదని టిడిపి వారే అంటారు. 2018 కాంగ్రెస్ అభ్యర్థిగా మిర్యాలగూడ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన కాంగ్రెస్‌లో ఉన్న సంగతి అప్పట్లో చాలా మంది కాంగ్రెస్ వారికే తెలియదు. ఇక 2022లో వైఎస్ఆర్‌సిపి తరపున ఏపి నుంచి రాజ్యసభకు కృష్ణయ్య ఎంపిగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి తర్వాత ఎంపి పదవికి ఆయన రాజీనామా చేశారు. అంతర్గతంగా ఏం జరిగిందో ఎవరికీ తెలియదు, ఉన్నట్టుండి బిజెపి తరపున, ఏపి నుంచి తిరిగి రాజ్యసభకు ఎన్నికయారు. టిడిపిజనసేనలతో బిజెపికి అక్కడ పొత్తుండటం వల్ల వారికో ఎంపి స్థానం లభించింది. కానీ, ఎంపి అయ్యాక ఆయనను పిలిచి పార్టీ సత్కరించడమో, ఆయనే స్వయంగా పార్టీ కార్యాలయానికి (ఏపిలోగాని, తెలంగాణలో గానీ) వచ్చి కృతజ్ఞతలు చెప్పడమో వంటి మర్యాదలేవీ జరుగలేదని బిజెపివాదులే వాపోతుంటారు. పైగా, కర్కోటకుడు, కరడుగట్టిన నేరస్థుడు నయీమ్‌ను మెచ్చుకోవడమే కాక, తనకు రూ. 200 కోట్లు ఇస్తానన్నాడని, తనని పార్టీ పెట్టమన్నాడనీ కృష్ణయ్య చెప్పారు. అతని వల్ల ఓట్లు వచ్చాయా? వైఎస్ఆర్‌సిపియే ప్రకటించుకున్నట్టు ఆర్.కృష్ణయ్యకు ఎంపి సీటివ్వడం వల్ల బిసిలంతా ఆ పార్టీ వైపు మొగ్గి ఉంటే, అసెంబ్లీ ఎన్నికల్లో వారికి అంతటి దయనీయ ఫలితాలు (11/175) ఎందుకు వస్తాయనే లాజిక్‌ను బిజెపి కేంద్ర నాయకులు ఆలోచించారో, లేదో? తెలియదు. అమలుపరిచే వరకు కేంద్ర నాయకత్వ ఆలోచన ఏపి బిజెపి నాయకులకు తెలిసినట్టు లేదు. తెలంగాణలో పార్టీని గెలిపిస్తే బిసి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలకు చెప్పి, కారణాలే చెప్పాపెట్టకుండా, ఎన్నికల ముందు ఉన్నట్టుండి బిసి రాష్ట్రాధ్యక్షుడు బండి సంజయ్‌ను ఎందుకు తప్పించారో అన్నది మాత్రం ఎవరికీ తెలియదు. తెలంగాణ బిజెపిలో ఎన్ని సొబగులు ఉన్నా నాయకుల మధ్య సయోధ్య లేదు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు, చాన్నాళ్లుగా బిజెపిలో ఉన్న పాత తరానికీ మధ్య స్పర్ధ ఉంది. ఎన్నికైన ఎంఎల్ఏలు, ఎంపిల మధ్య, వారిలో వారికి కూడా పెద్దగా సఖ్యత లేదంటారు. జంట నగరాల ఏకైక ఎంఎల్ఏ రాజాసింగ్ 'తానొక దుర్గం, తనదొక మార్గం' అన్నట్టు విడిగానే వ్యవహరిస్తారు.ఎంపిలు ఈటల రాజేందర్, డి.అర్వింద్, డి.కె. అరుణ, మాజీ ఎంఎల్‌సి రాంచంద్రరావులలో పార్టీ రాష్ట్ర అధ్యక్షపీఠం ఎవరికి దక్కుతుందనే చర్చ నిరంతరాయంగా సాగుతూనే ఉంది. పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో దాదాపు 35 వేల బూత్ కమిటీలకు గాను 22వేల కమిటీలు ఏర్పడ్డాయి, మిగతావి ఏర్పడుతున్నాయి. మండల కమిటీల ఏర్పాటు పూర్తయింది. జిల్లా కమిటీలు ఏర్పడాల్సి ఉంది. రాష్ట్ర కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తారా? ఢిల్లీ నాయకత్వమే నియమిస్తుందా? తేలాల్సిన అంశం. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను తిరిగి అధ్యక్షుడు కావాలని ఉందని, అందుకే ఆయన పరోక్షంగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుంటున్నారని పార్టీలోనే ప్రత్యర్థులైన వారు ఢిల్లీ వరకు మోశారు.అది తెలిసి ఢిల్లీ నేతలు ఆగ్రహంగా ఉన్నారనే సమాచారంతోనే 'రాష్ట్రాధ్యక్ష పదవికి నేను పోటీలో లేను' అని బండి స్వయంగా మీడియా ద్వారా ప్రకటన ఇచ్చుకోవాల్సి వచ్చిందనే ప్రచారముంది. పార్టీ నాయకుల మధ్య సఖ్యత లోపించడం వల్లే ఎన్నికల ముందు అత్యవసరంగా నాయకత్వాన్ని మార్చాల్సి వచ్చిందని స్వయంగా ప్రధాని ఒక అంతరంగిక సమాచారంలో వెల్లడించే వరకు, ఆ మార్పు ఎందుకు జరిగిందనేది మిస్టరీయే! అప్పట్లో ఆయన జరిపిన పాదయాత్ర (నాలుగు విడతల)ను అధికారికంగా ముగించలేదు. ఎందుకు అనుమతించారో? ఎందుకు ఆపేయమన్నారో..? హేతుబద్ధంగా ఎందుకు ముగించలేదో కూడా ఎవరికీ తెలియదు.

# ప్రియాంక గాంధీపై వ్యాఖ్యలకు నిరసనగా దిష్టి బొమ్మ దగ్ధం

**– తెలంగాణ స్టేట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి**

ఖనాపూర్ నియోజకవర్గం, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ఉట్నూర్ మండల కేంద్రం లో దిష్టి బొమ్మ దగ్ధం ఢిల్లీలో ప్రియాంక గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తెలంగాణ స్టేట్ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ మాజీ





ఎంపీ రమేష్ బిదురి దిష్టిబొమ్మ దహనం దిష్టి బొమ్మను దగ్ధం చేయడం జరిగింది. మా నాయకులపై అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన కాబర్ధర్ అని ఖానాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అత్రం రాహుల్ దేవ్ , ఉప అధ్యక్షులు పరమేశ్వర్ రావ్, ఉట్నూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుట రాజేశ్వర్, ఎర్దండి సుశీల్ కుమార్, కలిం, భీమన్న, గంగేశ్, అశోక్, భాస్కర్, సల్మాన్ రాజ్ , కైలాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

**– మేకల శ్రీనివాసరావు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి**




సూర్యాపేట, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హెచ్పీసీఎల్ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్ల యొక్క వేతనాలను తక్షణమే పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈరోజు హెచ్పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్ల ఏఐటీయూసీ అనుబంధం ఐదవ రోజు సమ్మెలో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆరో కు మరియు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వడం జరిగింద. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ట్రాన్స్ పోర్ట్ యాజమాన్యం ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు వారి కడుపు మంట ట్రాన్స్పోర్ట్ యజమానికి అర్థం కావడం లేదని వారి ఓపిక నశిస్తే జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహించారని ఆయన ఘాటుగా




హెచ్పీసీఎల్ ట్రాన్స్పోర్ట్ యాజమాన్యాల ఉద్దేశించి విమర్శించారు. రాత్రి ఇంకా పగలనక ఊడిగం చేస్తున్న డ్రైవర్ల వేతనాలు పెంచడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వాయిుస్తుందని కనీసం శాంతియుతంగాసమ్మె చేసే హక్కు లేదని నిరసన తెలపడానికి వీలులేదని దౌర్జన్యానికి పాల్పడుతున్న యాజమాన్యం చర్యలు ప్రజాతంత్ర వాదులు ఖండించాలని ఆయన అన్నారు జీతభత్యాలను పెంచి ఇతర సమస్యలను పరిష్కరించుకుంటే మిల్టెంట్ పోరాటానికి సిద్ధమవుతావని హాని హెచ్చరించినారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు దంతాల రాంబాబు, హెచ్పీసీఎల్ ట్యాంక్ డ్రైవర్ల అధ్యక్షులు ఎస్కె బాబా కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, ఆల్ టాంకర్స్ డ్రైవర్స్ అందరు పాల్గొన్నారు.

# భద్రాద్రిలో వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవం

**రామయ్య భక్తులకు దర్శనం తిలకించి తరించిన భక్తజనం**

**వైకుంఠ రాముడిగా భక్తులకు అనుగ్రహం**

**రామనామ స్మరణలతో మారు మోగిన భద్రాద్రి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామయ్య ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ అంటూ జయ జయధ్వానాలు చేశారు. వేదపండితులు ముక్కోటి విశిష్టతను వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్ లతో పాటు ఇతర సెక్టార్లలోని భక్తులు వేడుకను తిలకించారు. స్థానాచార్యులు భక్తులకు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించారు. అర్చకులు 108 ఒత్తులతో వెలిగించిన హారతినికి భక్తులు అందుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా దర్శనం తర్వాత ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్లు పర్యవేక్షణకు జిల్లా అధికారులను, లైజన్ అధికారులను నియమిం చారు. బందోబస్తు ఏర్పాట్లును ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షించారు. వేడుకలకు రాష్ట్ర వ్యవసాయ, చేనేత మరియు సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి సతీమణి మాధురి రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం, పినపాక, ఇల్లందు, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్ రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఐటిడిఏ పిఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ దంపతులు, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్. దేవస్థానం ఈ ఓ రమాదేవి తదితరులు హాజరయ్యారు. గరుడ వాహనరూపుడైన రామచంద్రుడు భక్తులకు శ్రీమహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చ కులు స్వామివారికి విశేష ఆరాధన, శ్రీరామ పదాక్షరీ మంత్ర



సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వే చాలు, గరుడ ప్రబంధాలు, ఇతిహాసాలు, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతకాన్ని పఠించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతినిచ్చారు. భక్తరామదాసు కాలం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీని వాస్ మూలవరులకు స్నపనం నిర్వహించారు. ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చిన అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు తరలివెళ్లారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అందా కమ్మ వారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మ వారు, గరుడ వాహనంపై శ్రీరామచంద్రమూర్తుల తిరువీధి సేవ సాగింది. మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేదమం త్రోచ్చారణ మధ్య శోభాయమానంగా సాగింది. రాపత్తు ఉత్సవాలు ప్రారంభం.

**వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం విజయవంత కావడం పట్ల జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవాలు నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన భక్తులకు, పాత్రికేయులకు ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్ర స్థాయి విజేతలకు అదనపు కలెక్టర్ అభినందనలు

మహబూబాబాద్ జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): జనవరి 7 నుండి 9 వరకు మహబూబ్ నగర్ జిల్లాలోని జడ్చర్ల, పోలేపల్లి సెజ్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపిక అయిన ఏకశిలా హై స్కూల్, మహబూబాబాద్ విద్యార్థి శ్రీకరన్ రెడ్డి జూనియర్స్ విభాగంలో, మరియు ఉపాధ్యాయ విభాగం లో డా. వి. గురునాధరావు లను శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అభినందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ స్థాయిలో రాణించాలని, పేటెంట్స్ కూడా సాధించాలని ఆశభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ రెడ్డి గారు మాట్లాడుతూ జాతీయ స్థాయి లో కూడా మన జిల్లా కీర్తి పతకాన్ని ఎగురవేయాలని అన్నారు.ఈ సందర్భంగా సైన్స్ అధికారి



అప్పారావు మాట్లాడుతూ జనవరి 21 నుండి 25 వరకు పుదుచ్చేరి లో జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

# పోలీస్ సేవలపైన క్యూఆర్ కోడ్ అభిప్రాయాన్ని తెలియజేయండి




**జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి ఐపీఎస్**



వికారాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర డిజిపి డా. జితేందర్, ఐపీఎస్ తెలంగాణ పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయము తెలుసుకోవడానికి నూతనంగా విడుదల చేసిన క్యూఆర్ కోడ్ పోస్టర్ (సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్) ను వినియోగించుకొని జిల్లా ప్రజలు పోలీస్ సేవల పైన తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా ఎస్పీ తెలిపినారు. ఇట్టి క్యూఆర్ కోడ్ పోస్టర్ లను జిల్లా లోని అన్నీ పోలీస్ స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాల్లో, డి.ఎస్పి ఆఫీసు ఎస్‌పి ఆఫీసులో మరియు సోషల్ మీడియా నందు అందుబాటులో ఉంటాయి. జిల్లా ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్యూఆర్ కోడ్ పైన స్కాన్ చేసి వచ్చిన లింక్ ను తెరచి తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఎస్పీగారు తెలియజేయడం జరిగింది.

# పోటీ పరీక్షల ఫౌండేషన్ కోర్స్ కు గడువు పొడిగింపు

జనగామ జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారు గ్రూప్స్ వన్ టు త్రీ ఫోర్ రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి నాలుగు నెలల ఉచిత బేసిక్ ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తుల గడువు 2025 ఫిబ్రవరి 15వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి బి రవీందర్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ విద్యారత సర్టిఫికెట్లతో దరఖాస్తును కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందచేయాలని కోరారు.

# పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ కొరకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): 2024 –25 సంవత్సరానికి అర్హత కలిగిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థిని, విద్యార్థులు అందరూ పోస్ట్మెట్రిక్ స్కాలర్షిప్ కొరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విక్రమ్ తెలిపారు. స్కాలర్షిప్ల కొరకు సంబంధిత కాలేజీలు డిజిటల్ కి ని ఉపయోగించి మాత్రమే విద్యార్థిని విద్యార్థుల అప్లికేషన్లను తమ కార్యాలయానికి పంపవలసిందిగా కోరారు. పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కొరకు వెబ్ సైట్ www.telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ 2025 మార్చి 31కి పొడిగించినట్లు పేర్కొన్నారు.

# అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




**– ఆర్టీఐ, యు.ఏప్ క్యాలెండర్ ఆవిష్కరణలో కాటారం సీఐ నాగార్జున రావు..**

మల్హర్ రావు: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కాటారం సిఐ నాగార్జున రావు పిలుపునిచ్చారు..కాటారం పోలీస్ స్టేషన్లో శుక్రవారం యునైటెడ్ ఫోరమ్ పర్ ఆర్టీఐ సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక 2025 క్యాలెండర్ కాటారం ఎస్ఐ అభినవ్,మహాముత్తారం ఎస్ఐ మహేందర్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా మాట్లాడారు అవినీతికి అడ్డుకట్ట వేసేం దుకు సమాచార హక్కు చట్టం చట్టాన్ని ఆయుధంగా వినియోగించు కొని ప్రతి ఒక్కరూ అవినీతి నిర్మూలనకు నడుం బిగించాలన్నారు. అవినీతి అక్రమాలను ఎదుర్కొనేందుకు యువత, రైతులు, ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకొని పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా ముందుకు నడవాలని,ఈచట్టాన్ని దుర్వినియోగం కాకుండా చూడవ లసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్టీఐ యు.ఏప్ కాటారం డివిజన్ కన్వీనర్ చింతల కుమార్ యాదవ్ మాట్లాడుతూ పాలనలో పారదర్శకత అధికారులు జవాబుదారితనం ఉండాలన్నారు,ఈ కార్యక్ర మంలో ఆర్టీఐ సభ్యుడు బూడిద రాజసమ్మయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో సంక్రాంతి ముగ్గుల పోటీలు

### – పండగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వుండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు అన్నారు. తెలుగు వారి పండుగ సంక్రాంతిని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ మరియు అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా సిబ్బంది మరియు న్యాయవాదులు రంగవల్లులతో కోర్టు ప్రాంగణాన్ని మెరిపించారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి అనితావని, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే. సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, న్యాయవాదులు పగడాల ఆనందరావు, ఎన్. విష్ణువర్ధన్ రావు, పరమేశ్వర్, సీనియర్ అడ్వకేట్ బేగ్, మంగళంపల్లి రాజకుమార్, ఎన్. ప్రశాంత్, పరానంది సురేందర్, ఎం.డి. రఫీక్, కే. అక్షయ, జి. ప్రియాంక, మచ్చ వసంత, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 14న మాదిగ కళాకారుల బస్సు యాత్ర

### విజయవంతం చేయాలని విజ్ఞప్తి

వెంకటాపూర్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా, వెంకటాపూర్ మండలం కేంద్రంలో శుక్రవారం ఎంఆర్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం జరిగింది. దొమ్మటి రమేష్ మాదిగ, మోరే లింగస్వామి మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎంఎస్పీ మహాజన సోషలిస్టు పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి కాడాపాక శ్యామ్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన మాదిగల కళాకారుల బస్సు యాత్ర మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లా రామప్ప వెంకటాపూర్ మండలంలోని కళాకారుల బస్సు యాత్ర రానున్న సందర్భంగా శుక్రవారం వెంకటాపూర్ మండలంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ చేయాలని ఫిబ్రవరి 7న వేయి గొంతులు లక్ష డబ్బులు తో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాదిగలు హైదరాబాద్ నడి బొడ్డున డప్పు కొట్టి దండోరావేచి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని మాదిగ పల్లెలకు వస్తున్న మాదిగ కళాకారుల



బస్సు యాత్రను విజయవంతం చేయాలనివారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గడ్డమీది రమేష్ మాదిగ, జీడి రమేష్ మాదిగ, వంశీ మాదిగ. ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి అల్లకొండ కుమార్ మాదిగ ఎంఆర్పీఎస్ మండల ఉపాధ్యక్షులు కాలేసి కిరణ్ మాదిగ మండల కోశాధికారి వేల్పుల అనిల్ మాదిగ, కాలేసి రవి మాదిగ, మొలాంగురి కుమార్ మాదిగ మరియు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

### జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): రహదారి భద్రత నిబంధనలు పాటించి, ప్రమాదాలను నివారించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. శుక్రవారం చెల్పూర్ లోని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ కిరణ్ ఖరే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీఓ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించడంతో పాటు కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని శుక్రవారం ఎస్పీ కిరణ్ ఖరే ప్రారంభించగా, వంద మంది డ్రైవర్లు సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ రహదారి భద్రత కోసం అధికారులు కృషి చేయాలని, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. నేటి నుంచి ఈనెల 31 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు జరుగుతాయని తెలిపారు. రోడ్డు ప్రమాదకు గల కారణాలు డ్రైవర్లకు దృష్టిలోపం ఉండడం కూడా ఒకటి అని, చాలామంది డ్రైవర్లకు అవగాహన లేక కంటి పరీక్షలు చేయించుకోరని, దాంతో వారికి దృష్టిలోపం ఉన్న విషయం వారికే తెలియదనీ అన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన రోడ్డు రవాణా శాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో హెవీ డ్రైవర్లకు, పాఠశాల, కళాశాల డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి సంధాని మహమ్మద్, చిట్యాల సిఐ మల్లేష్, ఆర్టీఓ ఏఓ శ్రీనివాస్, ఆప్తమాలజిస్ట్ రవికుమార్, గణపురం ఎస్ఐ అశోక్, ఏఎంవీఐ లు సుందర్ లాల్, శ్రీనివాస్, ఆర్టీఓ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ కేంద్రాన్ని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఓ

ములుగు జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. గోపాలరావు రాయినిగూడెం పరిధిలోని, జంగాలపల్లి గ్రామంలోనీ, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ కేంద్రాన్ని సందర్శించి, వైద్య సేవలకు వచ్చిన రోగులు మరియు వైద్య సిబ్బందితో మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు మరియు ఆరోగ్య సూత్రాల పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను ఆరోగ్యం పంతులుగా చేయాలని తెలిపారు. రోగులను ఉద్దేశించి మాట్లాడుతూ, మందులతో పాటు మంచి పోషకాహారమును తీసుకోవాలని, దానితోపాటు శారీర శ్రమ చేయాలని, అప్పుడే బిపి. షుగర్ లాంటి వ్యాధులు అదుపులో ఉంటాయని తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ గ్రామంలోని శానిటేషన్ కమిటీ మీటింగ్ మరియు అంగన్వాడి సెంటర్లో నిర్వహించే వి. హెచ్. యన్ డి .సందర్భంగా వచ్చే గర్భిణీ స్త్రీలకు మరియు పాలుచు తల్లులకు పోషకాహారం పై, తల్లిపాలు మరియు వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని చెప్పారు .అటు తరువాత



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్వహించే ఓపి రిజిస్టర్ టీబి మరియు అసంక్రమిక వ్యాధుల రిజిస్టర్ లను మరియు మందుల నిల్వల రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డెమో ఇంచార్జ్ సంపత్, ఆరోగ్య కార్యకర్త రమ మరియు చికిత్సకు వచ్చిన రోగులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో అదనపు కలెక్టర్ విస్తృత పర్యటన

మహబూబాబాద్ జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): శుక్రవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లాలోని పెద్ద వంగర, తొర్రూరు మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ (బాలికలు) ప్రభుత్వ బాలికల ఉన్నత సాంఘిక సంక్షేమ శాఖ (బాలికలు ) వసతి గృహం, కాలేజ్ , మహాత్మ జ్యోతిరావు పూలే టిబిసి డబ్ల్యు ఆర్, స్కూల్ (బాయ్స్) లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు వసతి గృహాలు, కాలేజిలు పాఠశాలలోని తరగతి గదులను, వంట గదులను, స్టడీ రూమ్, స్టాక్ రిజిస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయుల, హాజరు పట్టికలను సందర్శించి తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ లను రుచికరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వంటలు సిద్ధం చేసే సిబ్బంది పరిశుభ్రంగా ఉండాలని సూచించారు నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన ప్రదేశాలలో అన్ని వసతి గృహాలను నిత్యం తనిఖీలు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో ప్రతిభ కనబరిచే విధంగా విద్యా బోధనలు అందించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు అందించే డైట్ మెనూ ప్రకారం రుచికరమైన వంటకం



అందించడం జరుగుతుందని, పరిశుభ్రత పరిరక్షణ పాటించాలని, వసతి గృహాలు పాఠశాలల పరిసరాల్లో సానిటేషన్ క్రమం తప్పకుండా నిర్వహించాలని పాఠశాలు,వసతి గృహాల హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపల్స్ క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలని, నిత్యం వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థులను గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వార్డెన్లు ప్రిన్సిపల్ తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

### ఆలయాలకు పోటెత్తిన భక్తులు

సూర్యాపేట, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని పలు దేవాలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజామున నుండి ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా వణికించే చలిని సైతం లెక్కచేయకుండా తల స్నానాలు చేసి ఆలయాలకు చేరుకున్న భక్తజనులు భక్త పారవశ్యంతో మునిగిపోయారు మండలంలోని దిర్శించర్ల గ్రామంలో వేంచేసి ఉన్న పురాతనమైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం మరియు శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం గావించి భక్తజనులకు స్వామి అమ్మవార్ల దర్శనాన్ని ఆలయ ప్రధాన అర్చకులు అన్నం బోట్ల ఫణి కుమార్ శర్మ గావించి కోరిన కోర్కెలు భక్తులకు తీర్చాలని అంతా శుభం కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అన్నం బొట్ల ప్రణయ్ కుమార్ శర్మ నల్లూరి శ్రీనివాసాచార్యులు, నల్లూరి పురుషోత్తమా చార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ లు చెన్నబోయిన నవీన్,తాళ్లూరి లక్ష్మీనారాయణ,



సభ్యులు వేముల నాగయ్య, బండి సతీష్ కుమార్, దేవరశెట్టి నాగేశ్వరరావు, గెల్లి యోగానందం, గెల్లి లక్ష్మీ, నరసింహారావు, జూలూరు అశోక్, తాళ్లూరి శ్రీనివాస్,మహిళా భక్తులు గ్రామ భక్తజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్,సైబర్ నేరాలపై అవగాహన

### సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలి

### నేరేడుచర్ల మండలం ఎస్ ఐ రవీందర్

సూర్యాపేట, జనవరి 10 (తీన్మార్ న్యూస్): డ్రగ్స్,సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఎస్ ఐ రవీందర్ అన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పినాకిల్ హైస్కూల్ లో సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాబృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతు జిల్లా ఎస్పి అధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై , సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్న మనం మూఢనమ్మకాలు నమ్మకూడదని తెలియజేశారు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దనీ బ్యాంక్ ఖాతా,ఎటిఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దనీ, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దనీ మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు.సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని అతివేగం ప్రయాణించవద్దు అని





వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని అన్నారు.అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పినాకిల్ హైస్కూల్ ప్రిన్సిపల్ మదార్, పోలీస్ సిబ్బంది హోమ్ గార్డ్ నాగరాజు, కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, నాగార్జున విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

# హరీష్ రావు కృషివలన 26 వందల ఎకరాలకు సాగునీరు అందనుంది

### హరీష్ రావు చిత్రపటానికి పాలభి షేకం

చిన్నకోడూర్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గంగాపూర్ సరిహద్దులలో ఉన్న రైతులకు సాగు చేసుకోవడానికి నీరు అందడం లేదని మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు గారికి రైతులు విన్నవించగా సంబంధిత అధికారులతో సంప్రదింపులు చేసి అదే విధంగా కాల్వ కోసం భూములు పోయే రైతులతో మాట్లాడి ఒప్పించి కాల్వ పనులను ప్రారంభించడం సంతోషకరమని రైతులు అన్నారు ఈ సందర్భంగా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కేసిఆర్ హరీష్ రావుల చిత్రపటానికి పాలభిషేకం చేసి హరీష్ రావు గారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య పాల్గొని మాట్లాడుతూ గతంలో ఈ కాల్వకు అనేక అడ్డంకులు ఉన్నాయని అయొక్క అడ్డంకులు తొలగించడానికి హరీష్ రావు సార్ కృషిచేసి సంబంధిత అధికారులతోని సంప్రదింపులు చేసి ఏది ఏమైనా భూములు పోతున్న రైతులకు తొందరగా డబ్బులు అందించాలని అదేవిధంగా తక్షణమే పని ప్రారంభించమని చెప్పగా సంబంధిత అధికారులు ఈరోజు జెసిబి ద్వారా కాల్వ పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలి పబ్బం గడుపుతున్నారని రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని కానీ హరీష్ రావు గారు చొరవ తీసుకొని రైతుల అభివృద్ధి తన ధ్యేయంగా రైతు కళ్ళల్లో ఆనందాన్ని చూడాలనే ఉ



ద్దేశంతో నిరంతరాయంగా వారికి వ్యవసాయం నడవాలని వ్యవసాయం నడవాలంటే నీళ్లు కావాలని ఆ నీటిని అందించే బాధ్యత తన భుజాల మీద వేసుకొని ఎప్పటికప్పుడు రైతులతో అధికారులతో సంప్రదింపులు చేస్తూ పెండింగ్ పనులను చేయిస్తున్నాడని ఇలాంటి నాయకుడు ఎక్కడ ఉండడని సిద్దిపేట నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా చూస్తూ ఎవరికీ ఏది అవసరం పడిన వారికి తక్షణమే సహాయ సహకారాలు అందిస్తున్నాడని కాబట్టే నియోజకవర్గం ప్రజలు హరీష్ రావు గారి వెంబడి ఉంటున్నారని వారు అన్నారు ఈ కాలువ ద్వార రెండు వేల ఆర్ వందల ఎకరాలకు నీరు అందుతుందన్నారు ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ సర్పంచ్ మద్దికుంట నవీన్ యూత్ మండల అధ్యక్షుడు గుండెల్లి వేణు రైతులు కుంటయ్య రాములు ఎల్లయ్య ఆకునూరి శంకర్, పిడిశెట్టి నర్సయ్య, శంకర్ రెడ్డి, శ్రీనివాస్, దేవయ్య, ఎల్లయ్య, భూపతి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజలు అమ్మితే కేసులు: ఎస్సై భువనేశ్వర్



జుక్కల్: మండలంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పతంగులు అమ్మే వ్యాపారస్తులు చైనా మాంజాలను అమ్మితే కఠినమైన చర్యలతో పాటు కేసు నమోదు చేయడం జరుగుతుందని జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని పతంగుల దుకాణంలో తనిఖీలు చేపట్టారు. దుకాణ యజమానులకు వారికి పలు సూచనలు చేశారు. చైనా మాంజాలు అమ్మ వద్దని నాణ్యమైన మాంజాలు దేశి రకమివి మాజాలు అమ్మకాలు నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పతంగులు, మాంజాల వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ చైనా మాంజూలు అమ్మినట్టు మా దృష్టికి వస్తే వారిపైన కఠిన చర్యలతో పాటు చెట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు జుక్కల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాణి హై స్కూల్ లో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు






## విద్యార్థులతో ముగ్గుల పోటీలు గెలుపొందిన వారికి బహుమతి

ఆత్మకూరు జనవరి 10 తీన్మార్ న్యూస్:-

వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్ లో శుక్రవారం రోజు స్కూల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు పాఠశాలలోని ఎనిమిది తొమ్మిది పదవ తరగతి విద్యార్థులు 60 మంది పోటీలో పాల్గొన్నారు విద్యార్థినిలు వేసిన రంగుల పాఠశాల ప్రాంగణం లో సంక్రాంతి శోభ సంచరించుకున్నది విద్యార్థినిలు వేసిన రకరకాల ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి ఈ పోటీలకు స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం భాగ్య వర్ధన్ రెడ్డి బాలురు ఉన్నత పాఠశాల జిహెచ్ఎం మదిలేటి ముఖ్య అతిథులు విచ్చేసి న్యాయ నిర్ణేతలుగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు వేసిన ముగ్గులు కేవలం డిజైన్లు కాక సమాజం ఆలోచింప చేసే విధంగా ఉన్నాయి అని ఆయన అన్నారు విద్యార్థినిలు వేసిన ముగ్గులో సామాజిక స్నేహతో రుణ హత్యలు స్త్రీల పై ఆపాలని వేసిన ముగ్గులను వారు ప్రత్యేకంగా అభినందించారు ఈ పోటీలో గెలుపొందిన వారు ప్రథమ బహుమతి శరణ్య సంతోషి 9వ తరగతి రెండవ బహుమతి వరలక్ష్మి శరోన్ రోజా పదవ తరగతి మూడవ బహుమతి అక్షయ వాసంతి పదవ తరగతి మరియు హర్షిని వైష్ణవి అలేఖ్య దీక్షిత లు కన్సోలేషన్ బహుమతులు పొందారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లతా గంగాధర్ అభిలాష మరియు ఉపాధ్యాయునిలు సునీత స్వర్ణ సంధ్య నాగలక్ష్మి చైతన్య లు విద్యార్థినిల తల్లిదండ్రులు పాల్గొన్నారు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పాఠశాల యజమాన్యం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు

# ఏరియా కమిటీ నుంచి ప్రజా ఉద్యమ కెరటంగా

మెదక్: "కార్మిక వర్గం సర్వశక్తులతో బహుముఖ విప్లవకర పోరాటం సాగించకపోతే పెట్టుబడిదారీ వర్గాన్ని ఓడించానికి అవసరమైన సన్నాహాలు చేయజాలవు" అన్న లెనిన్ స్ఫూర్తితో చిన్న ఏరియా కమిటీగా పురుడుపోసుకున్న సీపీఐ(ఎం) బలమైన ప్రజా ఉద్యమ కెరటంగా విస్తరించి ప్రజా పునాదిని పెంచుకుంది. హైదరాబాద్ జిల్లా కమిటీలో అంతర్భాగంగా ఉన్న పటాన్‌చెరు ప్రాంత ఉద్యమం 1995లో ఏరియా కమిటీగా ఏర్పడింది. అనేక ఆటంకాలు, అవరోధాలెదురైనా తట్టుకుని ట్రేడ్‌యూనియన్, విద్యార్థి ఉద్యమంపై కేంద్రీకరించడం ద్వారా ప్రజా క్షేత్రంగా బలమైన రాజకీయ పార్టీగా విస్తరించింది. పారిశ్రామిక వాడల్లో జరిగిన ఎన్నికల్లో ఉద్దండులైన నాయకుల్ని సైతం ఓడించిన ఎర్రజెండా.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజల ఆదరణతో గౌరవప్రదమైన ఓట్లు పొందింది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరించి ప్రజా పునాదిని పెంచుకుంటూనే సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలకు ఆతిథ్యమిస్తుంది.

భారత కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడిన తర్వాత పాత మెదక్ జిల్లాలో సీపీఐతోనే ఎక్కువ మంది నాయకులు వెళ్లారు. ఇద్దరు ముగ్గురు మాత్రమే సీపీఐ(ఎం)తో నడిచారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ జిల్లా కమిటీ పరిధిలో ఎంవీ భాస్కర్‌రావు నాయకత్వంలో బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం ప్రాంతాల్లో బీహెచ్‌ఈఎల్, ఏపీ స్కూటర్ ఫ్యాక్టరీ కేంద్రంగా ఉద్యమాలు నడిపారు. 1984లో ఓంకార్ విచ్ఛిన్నం తర్వాత విక్రంకుమార్ కూడా విచ్ఛిన్నం వెనకాలే వెళ్లారు. ఉన్న కొద్ది మంది నాయకులతోనే 1985 నుంచి 1995 వరకు హైదరాబాద్ జిల్లాలో కొనసాగారు. ట్రేడ్‌యూనియన్ రంగంలో విస్తరించేందుకు కేంద్రీకరించి పనిచేసిన నాయకత్వం పార్టీని విస్తరిస్తూ వచ్చారు. తొలిసారిగా 1995లో పటాన్‌చెరు తాలూకా కమిటీ పేరిట పార్టీ స్వతంత్ర్య కమిటీ ఏర్పడింది.




ట్రేడ్‌యూనియన్‌లో పార్టీ నిర్మాణాన్ని విస్తరిస్తూ ఎదిగిన ఆ పార్టీ 1997లో సంగారెడ్డిలో సీపీఐ(ఎం) తొలి జిల్లా మహాసభలు జరుపుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అప్పటి 46 మండలాల్లోనూ పార్టీని విస్తరింప చేస్తూ శాఖల్ని ఏర్పాటు చేసుకుంది. గ్రామ, పట్టణ, మండల, జిల్లా కమిటీలతో పాటు ఆయా రంగాల్లో పార్టీ శ్రేణుల్ని తయారు చేసుకుంటూ వచ్చింది. ఎర్రజెండా అంటే సీపీఐ(ఎం).. సీపీఐ(ఎం) అంటే ఎర్రజెండా.. అన్నట్టుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో తన ప్రస్తానాన్ని కొనసాగిస్తుంది. కార్మికులు, కర్షకులు, రైతులు, కూలీలు, వృత్తిదారులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు ఇలా సకల జనుల కష్టసుఖాలను తెలుసుకుంటూ సమస్య ఏదైనా స్పందించే స్థాయికి వచ్చింది. స్పందించడమే కాదు.. బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఫలితాలను కూడా సాధించి పెట్టిందనడంలో అతిశయోక్తిలేదు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా కేవల్ కిషన్ భవన్‌కు వెళ్లాలన్న బలమైన అభిప్రాయం సామాన్యుల్లోనే కాదు మధ్య తరగతి ప్రజల్లోనూ వినపడుతుంది.

# మున్సిపల్ అభివృద్ధియే లక్ష్యం

**- సెంట్రల్ లైట్స్,ఆక్సిజన్ పార్క్, కోటి 50 లక్షల అభివృద్ధి పనులు**

**- ప్రారంభించిన మక్తల్ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి**







ఆత్మకూరు జనవరి 10 తీన్మార్ న్యూస్:-వనపర్తి జిల్లా మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం రోజు మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఒక కోటి 50 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను శుక్రవారం రోజు మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కు 20 లక్షలు మరియు మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని పార్కు 60 లక్షల రూపాయలతో మరియు మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఒక కోటి యాభై లక్షలతో సెంటర్ లైట్లు ను వారు ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ కమీషనర్ శశిధర్ మున్సిపల్ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, చెన్నయ్య, అశ్విన్ కుమార్,నాగేంద్రం, కో ఆప్షన్లు, పుర ప్రముఖులు పట్టణ ప్రజలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 12న కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆవిర్భావ వేడుకలు..

**- రావులపాలెం లో నిర్వహణకు సన్నాహాలు**

**- తెలంగాణలోనూ ప్రాంతీయ బోర్డ్ ఏర్పాటుకు రైతులు డిమాండ్**

అశ్వారావుపేట : ఈ నెల 12 న రావులపాలెం సీఆర్సీ క్లబ్ లో కొబ్బరి అభివృద్ధి బోర్డు 45 వ ఆవిర్భావ దినోత్సవ సభ ఏర్పాటుకు నిర్ణయించారు.ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు,వాసం శెట్టి సుభాష్,ఎంపీ గంటి హరీష్ మాధుర్,జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు,కొబ్బరి అభివృద్ధి బోర్డు చైర్మన్ శుభా నాగరాజన్,హార్టికల్చర్ కమిషనర్,కొబ్బరి అభివృద్ధి బోర్డు సీఈవో ప్రభాత్ కుమార్ కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తదితర ప్రముఖులు ఈ వేడుకలకు హాజరు కానున్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు 1980 వ సంవత్సరంలో కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో మొదటిసారిగా ప్రారంభించారు.ఆ తరువాత దీని అనుబంధ కార్యాలయాలు కొబ్బరి పంట సాగు చేస్తున్న అన్ని రాష్ట్రాల్లో డిప్యూటీ డైరెక్టర్ స్థాయిలో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. ఏపీలో విజయవాడ కేంద్రంగా కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ గా కుమార్ వేల్ ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 45 వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నారు. దీన్ని కోనసీమలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఎన్నో రకాల ఎల్డీపీ(లేయింగ్ ఆఫ్ డీమాన్ సేవలు కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా (స్టేషన్ ప్లాంట్స్), రియేనేషన్ అండ్ రీప్లాంటేషన్(ఆర్అండ్ఆర్) వంటి ఎన్నో రకాల పథకాలను రైతుల



కోసం అందించారు. కొబ్బరి పండించే ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ పై ఇంకా ఏదో వివక్ష కొనసాగుతూనే ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భవించి 15 ఏండ్లు అవుతున్నా ఈ తెలంగాణ లో ప్రాంతీయ బోర్డ్ ను ఏర్పాటు చేయకుండా ఆంధ్రప్రదేశ్ విజయవాడ కేంద్రంగా తెలంగాణ లోనూ సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆవిర్భావ సభకు తెలంగాణ ప్రాంత కొబ్బరి సాగు చేసే రైతులు ఎక్కువ మంది పాల్గొని తమ వాణి వినిపించాల్సిఉంది.పథకాల పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. కొబ్బరి బోర్డు ఆవిర్భావ విన్నపం వేడుకలకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని రైతుసంఘం నాయకులు తుంబూరు మహేశ్వర రెడ్డి,కొక్కెరపాటి పుల్లయ్య లు శుక్రవారం పిలుపునిచ్చారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం అధికారులు,నిపుణులు పాల్గొని కొబ్బరి సాంకేతిక సహకారం,సలహాలు అందించే అవకాశం ఉందన్నారు.

# డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

**- క్షేత్రస్థాయి పర్యవేక్షణతో వేగంగా పోలీసు సేవలను అందించవచ్చు**

**- సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**






సూర్యాపేట, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పి కి డీఎస్పీ రవి, డివిజన్ సీఐ లు స్వాగతం పలికి కార్యాలయ ఆవరనంలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి పోలీసు సేవలు అందించాలని సూచించారు. అనంతరం కార్యాలయం రికార్డ్స్, పరిసరాలు పరిశీలించి తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో ఎన్ఫోర్స్మెంట్ గురించి సమీక్షించారు, రౌడి షిటర్స్, సస్పెక్ట్ పై నిఘా ఉంచాలనీ ఆదేశించారు. కేసులు, పిర్యాదులు పెండింగ్ ఉంచకుండా క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ లను, సర్కిల్ ఆఫీసుల పనితీరు పరిశీలించాలని డిఎస్పీ కి తెలిపినారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవి, సీఐ లు రాజేశేఖర్, వీర రాఘవులు, శ్రీను, రఘువీర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, డీసీఆర్బీ ఎస్ ఐ యాకూబ్, ఎస్పి సీసీ సందీప్, సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత: ఏస్ఐ మహేందర్..

పెద్దకోడప్ గల్ : మండలంలోని అంజనీ గేటు వద్ద శుక్రవారం రోజున ఎస్సై మహేందర్, నేషనల్ హైవే అధికారుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యతని, రోడ్డు నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంపొందించడం కోసమే ప్రతి ఏడాది రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసు, సయుక్తంగా నిర్వహిస్తున్నామని హెల్మెట్ ధరించక పోవడం,అతివేగం,నిర్లక్ష్యం,మద్యం సేవించి ,సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఒక సెల్ ఫోన్ కొంటేనే దానికి సురక్షితంగా కవర్ వేస్తున్నాము కానీ మనిషికి విలువయ్యే తలకు మాత్రం హెల్మెట్ ధరించడం లేదు ఒక చిన్న సెల్ ఫోన్ కి ఇస్తున్న ప్రాధాన్యత మనిషి ప్రాణానికి ఇవ్వట్లేదు ఈ కాలంలో సెల్ఫోన్ కొంటే కూడా దానికి ఇన్సూరెన్స్ కడుతున్నాము కానీ వాహనాలకు మాత్రం ఇన్సూరెన్స్ చేయించుకోవడం లేదు వాహనతులకు ఇన్సూరెన్స్ గనక



ఉంటే ఇన్సూరెన్స్ ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు భీమవర్తిస్తుందని ప్రతి ఒక్కరూ వాహనాలకు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసుకొని వాహనదారులు ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని వాహనదారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హైవే ఆక్సిడెంట్ మేనేజర్ సౌర ప్రతాప్ సింగ్, పోలీస్ సిబ్బంది జైల్ సింగ్,అంజి,శ్రీనివాస్,సంజు రెడ్డి, జైపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజమే మా లక్ష్యం

**- రాజకీయాల్లో విలువలు పాటించేది కమ్యూనిస్టులే**

**- నాయకుల మరణం కుటుంబానికే కాదు వామపక్షాలకూ తీరనిలోటు**

**- అమరుల ఆశయ సాధనకు కృషి చేయడమే వారికిచ్చే నివాళి : అమరుల సంతాపసభలో వక్తలు**

హైదరాబాద్: దోపిడీ రహిత సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రాజకీయాలు వ్యాపారమయంగా మారాయని అన్నారు. డబ్బు, ప్రలోభాలు, అధికార దాహం వంటివే కనిపిస్తున్నాయని చెప్పారు. రాజకీయాల్లో విలువలు పాటించేది కమ్యూనిస్టులేనని వివరించారు. అయితే విలువలు పాటించే కమ్యూనిస్టు నాయకుల మరణం ఆ కుటుంబానికే కాకుండా కమ్యూనిస్టు పార్టీలకు, సమాజానికీ తీరనిలోటని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోటు ప్రసాద్, మఖ్దూంభవన్ ఆఫీసు మాజీ కార్యదర్శి డిఎస్ రామచంద్రరావు మరణించడం పట్ల సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని




ప్రకటించారు. వారి ఆశయాల సాధన కోసం కృషి చేయాలని కోరారు. వారి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బాలమల్లేష్, పోటు ప్రసాద్, రామచంద్రరావు సంతాప సభను సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు అమరుల చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# కొచ్చి తరహాలో వరంగల్ విమానాశ్రయం

**- భూసేకరణ పూర్తిచేయండి : సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: కొచ్చి విమానాశ్రయం తరహాలో వరంగల్ విమానాశ్రయాన్ని సర్వ హంగులతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వరంగల్ నగరం అభివృద్ధి చెందుతుందనీ, ఆ మేరకే ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. వరంగల్ (మామూనూరు) విమానాశ్రయ భూ సేకరణ, ఇతర ప్రణాళికలపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కే జరువీర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దక్షిణ కొరియాతో పాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాన్ని ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని, ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలని చెప్పారు. కోచ్చి విమానాశ్రయం అన్ని వసతులతో ఉంటుందనీ, దాన్ని పరిశీలించాలని



అధికారులకు సూచించారు. వరంగల్ అవుటర్ రింగ్‌రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల ప్రజలు భవిష్యత్‌లో వరంగల్ విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగించేలా రహదారులు నిర్మించాలని చెప్పారు. టెక్స్‌టైల్స్‌తో పాటు ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల అభివృద్ధితో హైదరాబాద్‌ను ప్రతిబింబించేలా వరంగల్ నగర ప్రణాళికలు ఉండాలన్నారు. వరంగల్ విమానాశ్రయం పూర్తయితే మేడారం జాతరతో పాటు లక్నవరం, రామప్ప ఇతర పర్యాటక ప్రదేశాలకు వచ్చే ప్రజలు సైతం దానినే వినియోగించుకుంటారని తెలిపారు.

# రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్


- మిగులు విద్యుత్ ఇతర రాష్ట్రాలకు పంపిణీ
- పాలమూరును అన్నపూర్ణ జిల్లాగా మారుస్తాం
: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- విద్యుత్ ఉప కేంద్రాలు ప్రారంభం



వనపర్తి: రాష్ట్రంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, అయినప్పటికీ మిగులు విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు పంపిణీ చేసి రాష్ట్ర రైతాంగానికి ప్రయోజనం చేకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో రూ.23.30 కోట్లతో రెండు విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభం, ఏడింటికి శంకుస్థాపన చేశారు. 50 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కన్న కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాలమూరు– రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వెనుకబడిన పాలమూరు జిల్లాను అన్నపూర్ణ జిల్లాగా మారుస్తామని చెప్పారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్లల్లో ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వనపర్తి జిల్లాలో విద్యుత్ తీగలు లైన్ మార్పిడి, స్తంభాలు మార్చడానికి ఇప్పటికీ రూ.45 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. జనవరి 26 నుంచి అర్హులైన ప్రతి రైతుకూ ఎకరాకు ఏడాదికి రూ.12వేలు రైతు భరోసా ఇస్తామన్నారు. భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కూడా అదే రోజు ప్రారంభిస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని, ఇంకా కాని వారుంటే అందరికీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఎన్ని సమస్యలు ఉన్నా రైతాంగానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు చెప్పారు. ఉచిత విద్యుత్‌ను అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ ఇస్తామని చెప్పారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ఐదేండ్లలో లక్ష కోట్ల నిధులతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. రైతులకు ఇరిగేషన్ ఎంత ముఖ్యమో విద్యుత్ అంతే ముఖ్యమని చెప్పారు. ఈనెల చివరికి జిల్లాలో భారీ రుణ మేళా, జాబ్‌మేళా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మెగారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనరెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండి ముషారఫ్ అలీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ గిరిధర్ రావుల, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మెన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన 95 శాతం పూర్తి

- ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్‌సైట్ : మంత్రి పొంగులేటి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన 95 శాతం పూర్తయిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్ల గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తీసుకొచ్చామని తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలోగల తన కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఆయన ప్రారంభిస్తూ%ౌ%ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే indirammaindlu.telangana.gov.in కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు తీసుకున్న చర్యల వివరాలను ఫిర్యాదుదారుని మొబైల్‌కు మెసేజ్ ద్వారా తెలియజేస్తామన్నారు. గ్రామాల్లో ఎంపీడీవో, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదు వెళుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మధ్యవర్తులకు తావులేకుండా అర్హులైన వారికే ఇండ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీలైనంత త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని వివరించారు. దరఖాస్తుల పరిశీలన ఈనెల 8 నాటికి హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 95 శాతం పూర్తికాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88 శాతం పూర్తయిందన్నారు. కామారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో–98 శాతం, ములుగు, కరీంనగర్, సంగారెడ్డి, సిరిసిల్ల, మెదక్ జిల్లాల్లో–97శాతం, మహబూబాబాద్, జగిత్యాల, సిద్దిపేట, ఆసిఫాబాద్, జనగాం, రంగారెడ్డి, నిజామాబాద్, యాదాద్రి, పెద్దపల్లి జిల్లాల్లో– 96 శాతం పరిశీలన పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. త్వరలో లబ్దిదారుల ఎంపిక పూర్తిచేసి ఇండ్ల నిర్మాణానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దృష్టి సారించాలనీ, అలాగే అర్హులైన లబ్దిదారులకు ఇండ్లు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. మొదటి విడతలో నివాస స్థలం ఉన్న వారికి ఇండ్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి చెప్పారు. రెండవ దశలో ప్రభుత్వమే నివాస స్థలంతోపాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. మొదటి విడతలో వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాధలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు, సఫాయి కర్మచారులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టు వ్యవస్థ ఉండేదనీ, ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేసి లబ్దిదారులే ఇండ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పించామన్నారు. లబ్దిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా ఇండ్లు నిర్మించుకోవచ్చన్నారు. చివరి లబ్దిదారుని వరకు ఇండ్ల మంజూరు చేసి నిర్మించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ స్పెషల్ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డీ విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఛానల్ ద్వారా జీతాలు

- పంచాయతీ ఉద్యోగులకు ప్రతి నెలా అమలు
- దీనికోసం స్పష్టమైన విధానాన్ని అనుసరించాలి : సమీక్షలో సీఎం రేవంత్



హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెల నెలా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పని చేస్తున్నారనీ, వీరికి ప్రతి నెలా రూ. 116 కోట్ల జీతాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. వీరందరికీ జీతాల చెల్లింపులో ఆలస్యం కాకుండా స్పష్టమైన విధానం అనుసరించాలని పంచాయతీ రాజ్, ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. గ్రీన్ ఛానెల్‌లో వీరికి జీతాలు చెల్లించాలని చెప్పారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మాజీ మంత్రి జానారెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం బిల్లులను త్వరగా చెల్లించాలని ఆయన ఆదేశించారు. గతేడాది ఏప్రిల్ నుంచి దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయనీ, .. వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలన్నారు. కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదల అయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రాబట్టుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు.

# జీహెచ్‌ఎంసీ ఆఫీసు వద్ద కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్ల ధర్నా
- ఒక్కసారిగా ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వైనం
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తానంటూ కమిషనర్ హామీ



సిటీ: తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రూ.1,100 కోట్లు వెంటనే విడుదల చేయాలంటూ జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని బల్దియా హెడ్ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. చేసిన పనులకు బిల్లులు అందక అప్పుల పాలవుతున్నామని, తట్టుకోలేక పలువురు కాంట్రాక్టర్లు గుండెపోటుతో మరణించారని, ఇలా అయితే చిన్న కాంట్రాక్టర్లు ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల ఐక్యత వర్ధిల్లాలని, కమిషనర్ బయటకు రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాను.. బిల్లులు చెల్లించాలంటూ ఓ కాంట్రాక్టర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇతర కాంట్రాక్టర్లు అడ్డుకొని రక్షించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అప్రమత్తమైన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు కార్యాలయం లోపలికి రాకుండా గేట్లు మూసేసి వారిని అడ్డుకున్నారు. దాంతో గేటు వద్దే బైటాయించిన కాంట్రాక్టర్లు కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రస్తుత కమిషనర్ ఇలంబర్తి తమను పట్టించుకోవడం లేదని, కనీసం తమ సమస్యలను వినడానికి కూడా సిద్ధంగా లేరని ఆరోపించారు. గతంలో పనిచేసిన కమిషనర్లు తమతో మాట్లాడి, సమస్యను పరిష్కరించేలా చూశారన్నారు. పోలీసులను మోహరించి తమను అరెస్టులు చేయించాలని కమిషనర్ చూస్తున్నారని, ఇది సరైనది కాదంటూ వాపోయారు. అనంతరం కాంట్రాక్టర్లను తన ఛాంబర్‌కు పిలిపించుకున్న కమిషనర్ సమస్యపై చర్చించారు. సంక్రాంతి పండుగ లోపు రూ.500 నుంచి 600 వంద కోట్లు విడుదల చేస్తామని కమిషనర్ చెప్పినట్టు కాంట్రాక్టర్లు తెలిపారు. అయితే, 20వ తేదీ వరకు ఆ నిధులు విడుదల చేయకపోతే సమ్మె బాట పడతామని కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు.

# ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను 40 కి.మీ.కు మార్చాలి

- భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేం
- ఆర్డీఓ కార్యాలయం ముందు భూ నిర్వాసితుల ధర్నా
- రైతుసంఘం, సీపీఐ(ఎం) మద్దతు



చౌటుప్పల్: ఓఆర్ఆర్ నుంచి ట్రిబుల్ ఆర్ వరకు అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్లకు మార్చాలని, భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమిని ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల పోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. రైతు సంఘం, సీపీఐ(ఎం) నాయకులు మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి, తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్ల పైబడి మార్చాలని డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ నుంచి 28 కిలోమీటర్ల వరకు చేయడం వల్ల ప్రభుత్వానికి వచ్చే లాభం ఏమిటని ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న రైతులకు భూములు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. భూములు ఇవ్వడానికి ఏ ఒక్క రైతూ సిద్ధంగా లేదని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులు 80 శాతం భూమి ఇచ్చేందుకు అంగీకారం తెలపాలని, కానీ 20శాతం మంది రైతులు కూడా అంగీకారం తెలపలేదన్నారు. రైతుల అంగీకారం లేకుండా అశాస్త్రీయంగా ముందుకు వెళ్తే నిర్వాసితులు తిరగబడ్తారని హెచ్చరించారు. ప్రాణ ఇవ్వడానికైనా సిద్ధమేకానీ భూములు మాత్రం వదలబోమని రైతులు మొర పెట్టుకుంటున్నారని చెప్పారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో రైతు సంఘం జిల్లా నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు రాగీరు కృష్ణయ్య, గుజ్జ సింగిల్‌విండో చైర్మెన్ దోడ యాదిరెడ్డి, చీరిక సంజీవరెడ్డి, భూనిర్వాసితులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మారుపాక లింగంగౌడ్, దబ్బటి రాములుగౌడ్, ఉష్కాగుల రమేశ్‌గౌడ్, సందగల్ల మల్లేశ్‌గౌడ్, చింతల ప్రభాకర్‌రెడ్డి, జాల వెంకటేశ్‌యాదవ్, శ్రీశైలం, మైసయ్య, తొర్పునూరి మల్లేశ్‌గౌడ్, ఏనుగు ప్రతాప్‌రెడ్డి, ఏసిరెడ్డి దామోదర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నాగవల్లి దశరథగౌడ్, సుర్కంటి రాంరెడ్డి, వల్లూరి బోగయ్య, మంద జనార్దన్‌రెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

# యూజీసీ మార్గదర్శకాలు రద్దు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్.మూర్తి
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు




యూజీసీ నూతన మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపారు. అందులో భాగంగా ఓయూ జరిగిన కార్యక్రమంలో మూర్తి మాట్లాడుతూ.. యూజీసీ నిబంధనలను ఎస్‌ఎఫ్‌ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. ఉన్నత విద్యలో నిరంకుశమైన మార్పులు, ప్రతి ఆరు నెలలకు యూజీసీ గైడ్‌లైన్స్‌లో మార్పులు చేయడం సిగ్గుచేటు అన్నారు. యూజీసీ 2025 డ్రాఫ్ట్ ప్రకారం.. ఉన్నత విద్యలో ఎలాంటి అర్హతా లేకుండా, టీచింగ్ అంటే ఏంటో తెలియని వారిని ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, వీసీలుగా రిక్రూట్ చేస్తుందని తెలిపారు. అలాగే పరిశ్రమ నిపుణులు, పబ్లిక్ అడ్మినిస్ట్రేటర్స్, పబ్లిక్ పాలసీ, ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన సీనియర్ ప్రొఫెషనల్స్ వీసీలుగా నియమితులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల భవిష్యత్‌లో ఉన్నత విద్యలో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని చెప్పారు. ఉన్నత విద్యలో ఇలాంటి మార్పులు చేయడం వల్ల దేశంలో అశాస్త్రీయమైన భావనలు విపరీతంగా ఏర్పడతాయన్నారు. ఈ మార్పులు యూజీసీ గైడ్‌లైన్స్‌లా లేవని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నిబంధనలుగా అవి కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గదర్శకాలను తక్షణం వెనక్కి తీసుకోవాలని లేనియెడల దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ అధ్యక్ష కార్యదర్శులు ఉదరు కుమార్, రవి నాయక్, ఉపాధ్యక్షులు కష్ణ, మల్సూర్, అజరు కుమార్ విద్యార్థులు సహజ,స్పందన, సందీప్, వివేక్ , పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బాచుపల్లిలో గల పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మొదటి గేటు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలిపారు. వీసీ నియామకాల్లో ఇండిస్ట్రీయల్ సెక్టార్ వాళ్లను తీసుకరావడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో యూజీసీ నూతన డ్రాఫ్ట్ మార్గదర్శక ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజినీకాంత్ మాట్లాడారు. మెదక్ పట్టణంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజరు కుమార్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన మార్గదర్శకాలు ఫెడరలిజానికి ముప్పు వాటిల్లే విధంగా ఉన్నాయన్నారు. ఆ నిబంధనల ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలి

**జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్**

**సూర్య గ్లోబల్ పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు**

జగిత్యాల: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరుగవని, జీబ్రాక్రాసింగ్ భద్రత గురించి స్కూల్ యాజమాన్యం చక్కగా వివరించారని జగిత్యాల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం లోని సూర్య గ్లోబల్ పాఠశాలలో జాతీయ భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లడుతూ జిబ్రాక్రాసింగ్ భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు భద్రతా నియామాలు, ప్రాంతీయ చిత్రాలు చిన్నారులు చాలా బాగా చిత్రీకరించి, అవగాహన కల్పించడం ఆనందదాయకమన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం , మద్యం త్రాగి బండి నడపడం వలన జరిగే ప్రమాదాలను వివరించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపు తున్న వారిని అభినందిస్తూనే హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధించాలన్నారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై మల్లేశం మాట్లాడుతూ హెల్మెట్ ధరించిన వాహనదారులకు పూలు అందించి అభినందించారు. పాఠశాల డ్రైవర్ లకు హెల్మెట్ లను బహుమతిగా అందించారు. పాఠశాలలో ట్రాఫిక్ గురించి చిత్రాలను ప్రదర్శించిన చిన్నారులను అధ్యాపక బృందాన్ని డీటీఓ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై మల్లేశంలు అభినందించారు.

# హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి

**గాంధీ ఆసుపత్రిలో సర్వం సిద్ధం**

సికింద్రాబాద్..: దేశంలో హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందుతున్న నేప థ్యంలో గాంధీ ఆసుపత్రి యంత్రాంగం అప్రమత్తమైంది. ఆసుపత్రి ప్రధాన భవనంలోని మూడు, నాలుగు అంతస్తుల్లో 40 పడకలతో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేసినట్లు గాంధీ ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ సునీల్ కుమార్ తెలిపారు. వాటిలో పురుషులకు 15, మహి ళలకు 5, పిల్లలకు 20 పడకలు కేటాయించింది. హెచ్‌ఎంపీవీ వైరస్ కరోనా అంత ప్రమాదం కాదని, సాధారణ ఇన్ఫ్లుయెంజా మాత్రమేనని, వెంటనే వ్యాప్తి చెందే ఇటువంటి వైరస్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆసుపత్రి వైద్యనిపుణులు తెలిపారు. ఈ వైరస్ పట్ల ప్రజలు ఆందోళనకు గురవలసిన అవసరం లేదని జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని సూచించారు. నివారణ చర్యలు తీసుకుంటూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇప్పటివరకు ఈ వైరస్‌తో ఒక్క మరణం కూడా సంభవించలేదని అన్నారు.

కొవిడ్ నోడల్ కేంద్రమైన గాంధీ ఆసుపత్రిలో 600 ఆక్సిజన్ పడకలు, 450కి పైగా వెంటిలేటర్లు, 400 మానిటర్లు, సుమారు 40 వేల కిలోలీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులు, వందలాది ఆక్సిజన్ సిలిండర్లు, పీడియాట్రిక్ వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు

# సంక్రాంతికి టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధం

సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 6432 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 10, 11, 12 తేదిల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 19, 20 తేదిల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.50 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి.

ఈ నెల 10, 11, 12 తేదిలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 19, 20 తేదిల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.50 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఈ సంక్రాంతికి కేవలం 5 రోజులు పాటు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ సవరించింది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను లిలిలి.బిణబతీబిఇఎబీబ.తిని వెబ్ సైట్ లో చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సూచించింది.

# యూ ట్యూబ్ చూసి చైన్ స్నాచింగ్

హైదరాబాద్: చైన్ స్నాచింగ్ ఎలా చేయాలో యుట్యూబ్ ద్వారా చూసి నేర్చుకొని గొలుసు దొంగతనానికి పాల్పడ్డాడు. చాలా వింతగా ఉంది కదూ.. యుట్యూబ్ చూసి చైన్ స్నాచింగ్ ఎలా చేయాలో నేర్చుకొని గొలుసు దొంగతనానికి పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కృష్ణా జిల్లాకు చెందిన కొట్టి సాయిరాం అనే వ్యక్తి నెల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చి ప్రశాంత్ నగర్ ప్రాంతంలోని ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన బాలాజీనగర్ లో ద్విచక్ర వాహనం దొంగతనం చేశాడు. పైగా అదే రోజు వివేకానంద నగర్ కాలనీలో శ్వేత అనే ఓ మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఆమె మెడలో నుంచి గొలుసు తెంపుకుని పరారయ్యాడు. వెంటనే చోరీ చేసిన గొలుసును ముత్తూట్ సంస్థలో కుదవ పెట్టి డబ్బులు తీసుకున్నాడు. ఇంకేముంది.. ఎంచక్కా దొంగతనం చేశామా.. దాన్ని నగదుకు బదిలీ చేసుకున్నామా అన్నట్లు దర్జాగా తప్పించుకున్నా అని అనుకున్నాడు.. తన గొలుసు పోయిందనే బాధలో బాధితురాలు కూకట్ పల్లి పోలీసులను సంప్రదించింది. జరిగిన విషయం చెప్పి పోలీసుల సహాయం కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసుకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు 180 సీసీ ఫుటేజీలను పరిశీలించి ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిందీ.. గొలుసు దొంగతనానికి పాల్పడిన వ్యక్తి ఒకరే అని నిర్ధారించుకున్నారు. నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా పోలీసులు ముత్తూట్ ఫైనాన్స్ కు నోటీసులు జారీ చేసి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతనిని అరెస్ట్ చేసి రిమాండుకి తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ రావు పలు సంచలన విషయాలను వెల్లడించారు. నిందితుడు గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముదినేపల్లిలో సైతం 5 వాహనాలను చోరీ చేసిన కేసులో నిందితుడని తెలిపారు.

# కేసుల నుంచి బయిట పడేదెలా..

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరసగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయన పదేళ్ల కాలంలో ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారని అందరికీ తెలిసిందే. పేరుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అయినా ఎక్కువగా నిర్ణయాలు కేటీఆర్ తీసుకునే వారు అని అందరూ ఒప్పుకునే విషయమే. కేసీఆర్ ప్రగతి భవన్ బయటకు రారు. సచివాలయానికి కూడా ఆయన రాక అరుదుగా ఉండేది. అందుకే కేటీఆర్ పైనే ఎక్కువ మంది ఆధారపడే వారు. ఆయన చెప్పినట్లుగానే అధికారులు సయితం నిర్ణయం తీసుకునేవారు. ఇది అందరికీ తెలిసిందే. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సయితం కేటీఆర్ ఆదేశాల ప్రకారం నడుచుకునే వారు. ఆయన తీసుకునే నిర్ణయమే ఫైనల్ అయ్యేది. ఒకరకంగా చెప్పాలంటే కేటీఆర్ షాడో సీఎంగా చెలాయించారన్నది అందరికీ తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయనపై వరసగా కేసులు నమోదవుతున్నాయి. ఫార్ములా ఈ రేసు కేసులో కూడా క్విడ్ ప్రోకో జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తుంది. ఏసీబీ ఈ మేరకు కేసు నమోదు చేసింది. రేపు విచారణకు వెళ్లాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ముాలా ఈ కారు రేసు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా ఈఎఫ్ఓకు నిధులు బదలాయింపు.. అగ్రిమెంట్‌కు ముందే నిధులు చెల్లింపు వల్ల ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఏసీబీ ఆరోపిస్తుంది. అదే సమయంలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా విచారణ చేస్తున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు అక్రమాణలపై అవినీతి జరిగిందని బీసీ నేత యుగంధర్ గౌడ్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఓఆర్ ఆర్ టెండర్లలో 7,380 కోట్ల మేరకు అవినీతి జరిగిందంటూ అందిన ఫిర్యాదు కూడా కేటీఆర్ మెడకు చుట్టుకునే అవకాశాలు లేకపోలేదు. అయితే ఇప్పటివరకూ ఏసీబీకి ఫిర్యాదు మాత్రమే అందింది. కేసు ఇంకా నమోదు చేయలేదు. ఇంత పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగం జరిగాయన్న ఫిర్యాదు అందడంతో ఖచ్చితంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో కేటీఆర్ పై వరస కేసులు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో దీంతో పాటు మరికొందరు కూడా కేటీఆర్ పై ఫిర్యాదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓఆర్ఆర్ లో జరిగిన అవినీతిపై ఈడీకి కూడా ఫిర్యాదు చేశారు.

# ఔట్ సోర్సింగ్ నియామకాల అక్రమాలపై విచారణ జరిపించాలి

### ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం డిమాండ్

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో అవసరం లేకున్నా, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి పేషీ ద్వారా 40 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను సృష్టించి అక్రమంగా నియమించారనీ, దీనిపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆ సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తెలిపారు. కోట్లాది రూపాయల డబ్బులు చేతులు మారాయని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో ఔట్ సోర్సింగ్ పేరుతో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలు భర్తీ చేశారని తెలిపారు. గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 40 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను మంజూరు చేస్తూ ఆర్‌సీఏ1/1217/2024 నవంబర్14న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి పేరుతో నియామకాలు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం ఏదైనా ఒకశాఖలో ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్టు నియామకాలను జరపాలంటే అనుమతి పొందిన ఏజెన్సీ ద్వారా చేస్తారని గుర్తు చేశారు. ఆ ప్రొసిజర్‌ను పాటించకుండా గురుకుల శాఖ ద్వారా నియామకాలు జరపడంపై అనేక అనుమానాలున్నాయని తెలిపారు. ఒక్కొక్క పోస్టుకు రూ.2లక్షల నుండి రూ.5లక్షల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు గిరిజన శాఖలో కొంతమంది అధికారులు ప్రమేయం ఉందని తెలిపారు. ఆశాఖ ముఖ్యకార్యదర్శి బంధువు ద్వారా శాఖధికారులపై ఒత్తిడి చేసి ఇదంతా చేశారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. కింద స్థాయిలో విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు కూడా ఏజెన్సీల ద్వారా నియామకాలు జరపకుండా ,ప్రత్యక్షంగా నింపితే వారికి వేతనాలు ఏ ఖాతా నుండి చెల్లింపు చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాళ్లు ఈ ఉద్యోగాలు పొందిన వారిని జాయిన్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారనే పేరుతో ఐదు పోస్టులు మంజూరు చేయడాన్ని బట్టి చూస్తే దీనిలో రాజకీయ నాయకుల ప్రమేయం, కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్టు తేటతెల్లమవుతుందని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన గురుకులాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

# ప్రజాభిప్రాయం మేరకే ప్రత్యేక జిపి చేయాలనీ తీర్మానం

### మాజీ మంత్రి ఈశ్వర్ సూచనలతోనే గ్రామసభ

### ఇందులో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రమేయం లేదు

### బతికేపల్లి మాజీ ప్రజాప్రతినిధులు వెల్లడి

జగిత్యాల, జిల్లా లోని పెగడపల్లి మండలం బతికేపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన కొండయ్య పల్లి, పుల్లయ్యపల్లి అనుబంధ గ్రామాలు కొండయ్య పల్లి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ 2016-17 లో అప్పటి గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి అప్పటి మంత్రి,ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ కు అందజేయడం జరిగిందని బతికేపల్లి మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు తెలిపారు. బుధవారం బతికేపల్లిలోవారు విలేకరులతో మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ సూచనలతో కొండయ్య పల్లి లో గ్రామసభ నిర్వహించడం ప్రజాభిప్రాయ సేకరణ సేకరించడం జరిగిందన్నారు. అప్పటి ప్రజాభి ప్రాయ సూచన తోనే గ్రామపంచాయతీగా కావాలంటూ పుల్లయ్య పల్లె, కొండయ్య పల్లె గ్రామస్తులు కోరడం జరిగిందని వారు వివరించారు . అందులో మాజీ జెడపిటిసి లక్ష్మీనారాయణ రెడ్డి వర్గానికి చెందిన వారు, వారి కుటుంబ సభ్యులు మాత్రమే అక్కడి గ్రామస్తులను పోగుచేసు కొని పక్కదారిని పట్టిస్తూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. అప్పటి తీర్మానం ప్రకారం అక్టోబర్ 2023లో గ్రామసభ, గ్రామ పంచాయతీ పాలకవర్గ తీర్మానం చేసి ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ కు,జిల్లా కలెక్టర్ కు తీర్మానం కాపీ అందజేయడం జరిగిందని వివరించారు. జీవన్ రెడ్డిని విమర్శించడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని చెబుతూ ఒక కుటుంబ క్షేమం కోసమే పుల్లయ్యపల్లి, కొండపల్లి గ్రామస్తులను క్యాస లక్ష్మీనారాయణ రెడ్డి కుటుంబ వర్గీయులు పోగు చేసుకుని ఉద్దేశపూర్వకంగానే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. ఇది ఆ రెండు గ్రామాల ప్రజల ఆకాంక్ష మేరకే తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు తాటిపర్తి శోభారాణి, ప్రభాకర్ రెడ్డి, మద్దెల విమల సుధీర్, మాజీ ఎం పి టి సి కృష్ణ హరి, మాజీ ఉపసర్పంచ్ జక్కుల మల్లేశం, గ్రామస్తులు మన్నే గంగ రాజం, బాలుసాని మల్లేశం, అనిల్, శ్రీను గౌడ్, అశోక్ గౌడు, పోచంపల్లి రవి, పోచంపల్లి శ్రీను,లచ్చయ్య గౌడ్, సుంకే అంజయ్య, పర్ష గంగయ్య, పెద్దరాయమల్లు, నంగిసాగర్, దుర్గాప్రసాద్, రవి మద్దెల అశోక్, బాల్సాని అనిల్, దుర్గాప్రసాద్, ముంజ అశోక్ గౌడ్, మల్లేశం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి 30 నుంచి 50 లక్షలు

హైదరాబాద్: తెలంగాణలో గేమ్ ఛేంజర్ అవుతుందని భావిస్తోన్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే.. మొదటగా నిర్మించదలచిన రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియలోనూ స్పీడు పెంచారు అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో యాదాద్రి జిల్లా అధికారులు.. భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే తుర్కపల్లి పరిధిలో రెండు గ్రామాల రైతులతో మాట్లాడారు. మెరుగైన పరిహారం ఇస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆ రెండు గ్రామాల రైతులు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఇక.. మిగిలిన గ్రామాల రైతులతోనూ అధికారులు చర్చలు జరపనున్నారు.అయితే.. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంలో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం 164 కిలో మీటర్లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 5 మండలాల్లోని 24 గ్రామాల్లో 59 కిలో మీటర్ల నిర్మాణానికి 1800 ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాల్లోని రైతులు భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. ఉన్న రైతులకు మంచి పరిహారం ఇచ్చి ఒప్పించి మెప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. అధికారులు గ్రామాల బాట పట్టారు. రైతులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్హనుమంత రావు క్షేత్రస్థాయికి వెళ్లి బాధిత రైతులతో నేరుగా మాట్లాడుతున్నారు. ముందుగా తుర్కపల్లి మండలంలోనే రీజినల్ రింగ్ రోడ్డు ప్రారంభమవుతుండగా అక్కడి రైతులతో చర్చించారు. భువనగిరి మండలంలో196 ఎకరాలను సేకరించాల్సి ఉండగా.. రాయగిరి గ్రామంలోని 105 ఎకరాలకు చెందిన రైతులు భూమి ఇచ్చేందుకు వ్యతిరేకిస్తున్నారు. సర్వే నంబర్ 215తో పాటు పలు సర్వే నంబర్లలో ఎకరానికి రూ.13.12 లక్షలు, సర్వే నంబర్ 379తో పాటు మిగతా నంబర్లలో రూ.29.40 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో.. సర్వే నంబర్ 682 తో పాటు పలు నంబర్లలో రూ.36.75 లక్షల వరకు రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ఉండగా.. బహిరంగ మార్కెట్ ఎకరానికి కోట్లలో పలుకుతోంది. అయితే.. రిజిస్ట్రేషన్వ్యాల్యూను బట్టి రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలకు పైగా గ్రామానికి చెందిన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తుండగా.. ఆమేరకు ప్రపోజల్స్ రెడీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.మరోవైపు.. తుర్కపల్లి మండలం కోనాపురం, ఇబ్రహీంపూర్లో 38 ఎకరాలకు చెందిన రైతులను కలెక్టర్తో పాటు అడిషనల్ కలెక్టర్ కలిసి మాట్లాడారు. బహిరంగ మార్కెట్లో ఎకరానికి కోటి రూపాయల డిమాండ్ ఉందని.. తమకు కనీసం రూ.50 లక్షలైనా ఇవ్వాలని రైతులు కోరారు. అయితే.. నేషనల్ హైవే రూల్స్ ప్రకారం ఇక్కడ రిజిస్ట్రేషన్వ్యాల్యూకు మూడు రెట్లు మాత్రమే పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. ఇలా చూస్తే ఎకరానికి రూ.19 లక్షలే వస్తుందని అధికారులు వివరించారు. అయినప్పటికీ.. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు చెప్పిన మాటలకు.. రైతులు సానుకూలత వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. మిగిలిన 22 గ్రామాల రైతులతోనూ మాట్లాడి.. అందరిని ఒప్పిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.


# కేసీఆర్ మిస్సింగ్ ప్రకటనల కలకలం

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ బీజేపీ భారీ షాకిచ్చింది. ఏకంగా మాజీ సీఎం కేసీఆర్ కనిపించడం లేదంటూ, ఓ పోస్టర్ ను రిలీజ్ చేసిన బీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తెలంగాణ ఎన్నికల అనంతరం మాజీ మంత్రి కేసీఆర్ పార్టీ వ్యవహారాలు చూస్తున్నట్లుగా భావించవచ్చు. కానీ ఒక్కసారి మాత్రమే అసెంబ్లీ వైపుకు వచ్చిన కేసీఆర్, మరలా అటువైపు కూడ రాలేదు. అసెంబ్లీ సమావేశాల సమయంలో మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.ఇటీవల అసెంబ్లీ సమావేశాలకు వస్తారని అందరూ భావించారు కానీ అలా జరగలేదు. అలాగే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాపం తెలిపేందుకు స్పీకర్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అందుకు కూడ కేసీఆర్ గైర్హాజరయ్యారు. ముందుగా బీఆర్ఎస్ నేతలు మాత్రం ఆరోజు తప్పక వస్తారని కూడ భావించారు. కానీ కేసీఆర్ రాకపోవడంతో, పార్టీ నేతలు కూడ షాక్ కు గురయ్యారట. ఎన్నికల సమయం నుండి కేసీఆర్ కంటే కేటీఆర్ స్పీడ్ పెంచి పార్టీ వ్యవహారాలు చూస్తున్నారు. అంతలోనే ఎమ్మెల్సీ కవితకు కూడ బెయిల్ రావడంతో వీరిద్దరూ, జిల్లాల పర్యటనలు కూడ సాగిస్తున్నారు. తాజాగా ఫార్ములా ఈ కార్ రేస్ కు సంబంధించి కేటీఆర్ పై కేసు కూడ నమోదైంది. ప్రస్తుతం ఈ విషయం న్యాయస్థానం వరకు వెళ్ళింది.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కేసీఆర్ బయటకు వస్తారని అందరూ భావించారు. అంతేకాదు పలుమార్లు కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి కూడ పలుమార్లు బహిరంగ సభ వేదికల ద్వార కోరారు. తమ ప్రభుత్వానికి సలహాలు సూచనలు ఇవ్వాలని కూడ సీఎం కోరారు. వాటికి కేసీఆర్ నుండి ఎటువంటి స్పందన కనిపించకపోగా, కేటీఆర్ మై హూనా అంటూ స్పందించారు. తాజాగా ఇదే విషయంపై బీజేపీ ఓ ట్వీట్ చేసింది.పదేళ్లు అధికారం అనుభవించిన మాజీ సీఎం కేసీఆర్ కనుబడుట లేదని, ఆయన హోదా ప్రతిపక్ష నేత అంటూ పోస్టర్ ను బీజేపీ విడుదల చేసింది.

తెలంగాణను పదేళ్లు దోచుకొని, ప్రజలు ఓడిస్తే ప్రతిపక్షంలో కూడ కూర్చోకుండ కాంగ్రెస్ ను ప్రశ్నించకుండ ఉన్నట్లు పోస్టర్ లో ప్రచురించారు. బీజేపీ సోషల్ మీడియా ద్వార విడుదలైన ఈ పోస్టర్ ఇప్పుడు వైరల్ గా మారింది. మరి దీనికి బీఆర్ఎస్ రిప్లై ఎలా ఉంటుందో వేచిచూడాలి.

# 'గొడ్డుకారం'.. కల్పితమే

### - అది ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా చేసినది : ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్



నల్లగొండ: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలోని బాలికల హాస్టల్‌లో గొడ్డుకారంతో భోజనం పెడుతున్నట్టు ఇటీవల సోషల్‌మీడియాలో వచ్చిన వార్తలు కల్పితమేనని, నిజం కాదని ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. నల్లగొండ జిల్లా పరిధిలోని ఎంజీయూలో ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల యూనివర్సిటీలోని కృష్ణవేణి బాలికల హాస్టల్‌లో బాలికలకు గొడ్డుకారంతో భోజనం పెడుతున్నట్టు సోషల్ మీడియాలో వచ్చిన ఫొటోలు, వీడియోలు కేవలం కల్పితమేనని చెప్పారు. యూనివర్సిటీకి చెందిన ఒక విద్యార్థి ఉద్దేశపూర్వకంగా బాలికలతో ఫొటోలు, వీడియోలు తీయించి అధికారులకు, సోషల్ మీడియాలో పెట్టి యూనివర్సిటీ స్థాయిని దిగజార్చే విధంగా చేసినట్టు వివరించారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంజీయూలో వసతి గృహాల మెస్ నిర్వహణ పూర్తిగా విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహిస్తామని, ప్రతి నెలా ఒక విభాగం నుంచి సెక్రెటరీని ప్రజాస్వామిక పద్ధతుల్లో ఎన్నుకుంటారని వివరించారు. విశ్వవిద్యాలయంలో కొందరు విద్యార్థుల విపరీత చర్యల ద్వారా దురదృష్టకర సంఘటనలు జరుగుతున్న దృష్ట్యా ఫేస్ రికగ్నిషన్ హాజరును ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఎంజీయూలోని సెల్ ఫైనాన్స్ కోర్సులు అన్నింటినీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోర్సులుగా మార్చేందుకు ప్రతిపాదనలు, రాబోవు విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులు %-% గవర్నర్స్ అండ్ పబ్లిక్ పాలసీ, లా, డెవలప్‌మెంట్ స్టడీస్ వంటి కోర్సులను ప్రవేశపెట్టనున్నట్టు వివరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా యువతను దృష్టిలో ఉంచుకొని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం రూ.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది విశ్వవిద్యాలయం నుంచి మొత్తం రూ.260 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నిధులు తెచ్చుకుని సద్వినియోగం చేస్తామన్నారు.

# జడేజా ఔట్.. షమీ రీఎంట్రీ! ఇంగ్లండ్‌తో
## వన్డే సిరీస్ ఆడే భారత జట్టు ఇదే!




తీవ్ర బాధను మిగిల్చిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ పరాభవం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న టీమిండియా మరో సవాల్‌కు సిద్దమైంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ముందుగా ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జనవరి 22 నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 6 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 బరిలోకి దిగనుంది. ఈ మెగా టోర్నీకి ముందు ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌ను టీమిండియా సన్నాహకంగా వాడుకోనుంది. ఈ మూడు వన్డేల సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకీ మరో రెండు రోజుల్లో సెలెక్టర్లు జట్టును ప్రకటించే అవకాశముంది.

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆడిన జట్టునే దాదాపుగా ఛాంపియన్స్ ట్రోఫీకి కొనసాగించే అవకాశం ఉంది. అయితే ఈ టోర్నీలో ఎవరిని ఆడించాలి? ఎవరిని పక్కనపెట్టాలనేది సెలెక్టర్లకు తలనొప్పిగా మారింది. పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతున్న సారథి రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని కొనసాగించాలా..కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాలా? వన్డే వరల్డ్ కప్ తర్వాత జట్టుకు దూరమైన షమీ పూర్తి ఫిట్‌నెస్ అందుకున్నాడా? కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో వికెట్ కీపర్‌గా ఎవరికి అవకాశం దక్కనుంది? సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తుది జట్టులో ఉంటాడా? అనేవి మిలియన్ డాలర్ల ప్రశ్నలుగా మారాయి.

**రోకోకు ఆఖరి ఛాన్స్!**

టీ20 ప్రపంచకప్ 2024 విజయం తర్వాత పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను ఆఖరి ఛాన్స్‌గా ఛాంపియన్స్ ట్రోఫీలో కొనసాగించే అవకాశం ఉంది. వన్డే ఫార్మాట్‌లో వారికి ఉన్న రికార్డులు, అనుభవం దృష్ట్యా ఇద్దరిపై ఎలాంటి చర్యలు ఉండవని, ఛాంపియన్స్ ట్రోఫీలో కొనసాగుతారని ఇప్పటికే బోర్డు వర్గాలు తెలిపాయి. రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగనుండగా.. అతనికి జతగా జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది.

**షమీ రీఎంట్రీ..**

ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్న స్టార్ పేసర్ షమీ.. ఈ వన్డే సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న షమీ ఫిట్‌నెస్‌ను దగ్గర్నుంచి సమీక్షిస్తున్న బీసీసీఐ మెడికల్ టీమ్.. షమీకి క్లీన్‌చిట్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే షమీ భారత జట్టులోకి రానున్నాడు.

వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌ను కొనసాగిస్తారా? కేఎల్ రాహుల్‌ను తీసుకుంటారా? అనేది మిలియన్ డాలర్ల పశ్నగా మారింది. రాహుల్ ఆట గొప్పగా లేకున్నా.. మరి చెత్త ప్రదర్శనైతే చేయలేదు. పంత్ కూడా వన్డేల్లో గొప్పగా రాణించింది లేదు. బీజీటీ ప్రదర్శన నేపథ్యంలో రిషభ్ పంత్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇక సీనియర్ స్పిన్ ఆల్‌రౌండర్ జడేజా బ్యాటింగ్ వన్డేల్లో అంత గొప్పగా ఏం లేదు. అతని స్థానంలో అక్షర్ పటేల్‌ను జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. కుల్దీప్ యాదవ్ ఫిట్‌గా లేకుంటే వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం దక్కుతుంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తీ పేరును కూడా పరిశీలించవచ్చు.

**తెలుగోడికి ఛాన్స్**

ఆసీస్ పర్యటనలో అదరగొట్టిన తెలుగు తేజం నితీశ్‌కుమార్‌రెడ్డికి కూడా వన్డే సిరీస్‌లో చోటు దక్కే ఛాన్స్ ఉంది. సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ల కోటాలో హార్దిక్ పాండ్యాకు బ్యాకప్‌గా అతని తీసుకోవచ్చు. జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ సిరీస్ నుంచి రెస్ట్ ఇవ్వనున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలను కొనసాగించే అవకాశం ఉంది.

# BGT సిరీస్ లో బుమ్రాపై చెలరేగిన హీరో - ఇప్పుడేమో తుస్సు!



రీసెంట్ గా ముగిసిన బోర్డర్– గావస్కర్ ట్రోఫీలో.. క్రీజులో నృత్యం చేస్తున్నట్లు కదులుతూ భారీ షాట్లు బాదిన ఆ ప్లేయర్, తన జోరును కొనసాగించలేకపోయాడు. వికెట్ల వెనకాలకు ర్యాంప్ షాట్లు ఆడిన అతడు.. తాజాగా జరిగిన మ్యాచ్ లో తుస్సుమనిపించాడు. బీజీటీ సిరిస్ లో కోహ్లీ, బుమ్రా లాంటి స్టార్ ప్లేయర్లతోనే దూకుడుగా వ్యవహరించిన ఆ క్రికెటర్ తాజా మ్యాచ్ లో పేలవ ప్రదర్శన నిరాశపరిచాడు.

**అతడు ఎవరంటే?**

ఆ యంగ్ ప్లేయర్ మరెవరో కాదు సామ్ కొన్‌స్టాస్. ఇటీవలే ముగిసిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సిరీస్ లో తన ప్రదర్శనతో పాటు కోహ్లీ, బుమ్రాతో గొడవపడి.. తన పేరు మార్మోగేలా చేశాడు. అంతర్జాతీయ అరంగేట్రంలోనే ఈ 19 ఏళ్ల కుర్రాడు తన ప్రదర్శనతో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. మెల్ బోర్న్ క్రికెట్ గ్రౌండ్ లో ఫెంటాస్టిక్ హాఫ్ సెంచరీ బాది వెలుగులోకి వచ్చాడు. ఇటీవలి కాలంలో ఏ బ్యాటర్‌కు సాధ్యం కాని రీతిలో ఏకంగా బుమ్రాపై ఆధిపత్యం ప్రదర్శించాడు. అయితే ఇప్పుడు తాజాగా జరిగిన మ్యాచ్ లో ఆ దూకుడును కొనసాగించలేకపోయాడు సామ్ కొన్‌స్టాస్. ప్రస్తుతం జరుగుతోన్న బీబీఎల్ 2025లో సిడ్నీ థండర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తాజాగా హెూబర్ట్ హరికేన్స్ తో జరిగిన మ్యాచ్ లో డేవిడ్ వార్నర్ తో కలిసి బరిలోకి దిగిన అతడు క్రీజులో ఎక్కువ సేపు నిలబడలేకపోయాడు. ఎనిమిది బంతులు ఎదుర్కొన్న సామ్ కేవలం నాలుగు పరుగులే చేసి పెవిలియన్ చేరాడు. రిలే మెరిడిత్ షార్ట్ డెలివరీ వేయగా, దాని షాట్ బాదేందుకు ప్రయత్నించాడు సామ్. కానీ బంతి నేరుగా వికెట్ కీపర్ మ్యాథ్యూ వేడ్ చేతిలోకి వెళ్లిపోయింది. దీంతో సామ్ వికెట్ ను సమర్పించుకోవాల్సి వచ్చింది. ఇక సామ్ తో పాటు ఓపెనింగ్ చేసిన వార్నర్ కూడా వెంటనే ఔట్ అయిపోయాడు. ప్రస్తుతం సామ్ కొన్‌స్టాస్ ఔట్ అయిన వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. కాగా, బీబీఎల్ 2025 పాయింట్ల పట్టికలో సిడ్నీ థండర్ జట్టు ప్రస్తుతానికి అగ్రస్థానంలో ఉండగా, హెూబర్ట్ హరికేన్స్ జట్టు మూడో స్థానంలో కొనసాగుతోంది.

# 'యువరాజ్ కెరీర్ అందుకే నాశనం!'



యువరాజ్ సింగ్ ఇంటర్నేషనల్ కెరీర్ ముగియడానికి టీమిండియా స్టార్ బ్యాటర్ కోహ్లీనే కారణమని మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప సంచలన ఆరోపణలు చేశాడు. అప్పట్లో యువరాజ్ మ్యాచ్ విన్నర్ అయినప్పటికీ, అతడికి ఫిట్‌నెస్ పరీక్షల్లో ఎలాంటి వెసులుబాటు కల్పించలేదని అన్నాడు. యువరాజ్ సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆరు బంతులు ఆరు సిక్స్ లు అనగానే టక్కున అతడి పేరే ముందుగా క్రికెట్ అభిమానులకు గుర్తుకొస్తది. వన్డే, టీ20 ప్రపంచ కప్‌లను టీమ్ ఇండియా విజయం సాధించడంలో యువీది కీలక పాత్ర. ఈ రెండు వరల్డ్ కప్‌లను కూడా ధోనీ నాయకత్వంలో భారత జట్టు దక్కించుకుంది. అయితే తాజాగా యూవీ కెరీర్ పై సారథిగా కోహ్లీ వ్యవహరించిన తీరు సరైనది కాదంటూ ఉతప్ప అన్నాడు. క్యాన్సర్ ను జయించి 2017లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి యూవీ పునరాగమనం చేసినప్పుడు అతడికి విరాట్ మద్దతుగా నిలవలేదని గుర్తు చేశాడు. కెప్టెన్సీని కోహ్లీ, రోహిత్ ను పోల్చే క్రమంలో ఈ వ్యాఖ్యలు చేశాడు. సారథ్యంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మార్గాలు భిన్నమైనవని పేర్కొన్నాడు.

"క్యాన్సర్ నుంచి కోలుకున్నాక యువరాజ్ అంతర్జాతీయ క్రికెట్లోకి తిరిగి రావాలనుకున్నాడు. అతడు రెండు వరల్డ్ కప్ లు గెలవడంలో కీలకంగా వ్యవహరించాడు. అతడు కేవలం టోర్నమెంట్ లు మాత్రమే గెలవలేదు. క్యాన్సర్ ను కూడా జయించాడు. జీవితంలో అత్యంత కష్టమైన దశను అధిగమించాడు. అలాంటి వ్యక్తికి జట్టులో అవకాశం ఇవ్వలేదు. వీటి గురించి ఎవరూ నాకు ప్రత్యేకంగా ఏమీ చెప్పలేదు. నేను గమనించిన విషయాలను మాత్రమే చెబుతున్నాను. యువీకి అప్పుడు లంగ్ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. అందుకే ఫిట్ నెస్ విషయంలో రెండు పాయింట్ల తగ్గింపు కోసం యూవీ అభ్యర్థించినప్పుడు దానిని ఇవ్వలేదు. అయినా కూడా అతడు పూర్తి ఫిట్ నెస్ సాధించి టెస్ట్ ఆడాడు. పైగా అప్పటి కెప్టెన్ ఎవరూ కూడా యూవీకి మద్దతుగా నిలవలేదు. చివరికి యూవీ జట్టులో నుంచి వెళ్లిపోయాడు. ఆ సమయంలో కెప్టెన్ గా ఉన్న కోహ్లీ, అందరూ తనలాగే ఉండేలా ప్లేయర్ల ఫిట్ నెస్, ఆహారపు అలవాట్లకు పెద్ద పీట వేశాడు. విరాట్ ప్రతిఒక్కరు తన ప్రమాణాలను చేరుకోవాలని కోరుకుంటాడు. అది క్రికెటైనా, ఫిట్‌నెస్ లేదా ఇతర ఏదైనా విషయమైనా. అందరూ అవే స్టాండర్డ్స్ పాటించాలని బలంగా అనుకుంటాడు. కానీ రోహిత్ శర్మ అందరినీ కలుపుకొని పోయే స్వభావం కలిగిన కెప్టెన్ " అని ఉతప్ప అన్నాడు.

# టెన్నిస్ స్టార్ జకోవిచ్ పై విషప్రయోగం!

టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ సంచలన ఆరోపణలు చేశాడు. తనపై విషప్రయోగం చేశారని, ఓ హెూటల్ యాజమాన్యంపై సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. తాజాగా ఆస్ట్రేలియాన్ ఓపెన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశాడు.

2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొనే వారు కచ్చితంగా కొవిడ్ వ్యాక్సిన్ వేసుకోవాలని నిబంధనలను పెట్టారు. కానీ జకోవిచ్ దానికి అంగీకరించలేదు. వ్యాక్సిన్ వేసుకోకుండానే మ్యాచులు ఆడేందుకు ఆస్ట్రేలియా మెల్ బోర్న్ లోకి అడుగుపెట్టాడు. కానీ అక్కడ జోకోవిచ్‌కు స్థానిక అధికారుల నుంచి చుక్కెదురైంది.

కొవిడ్ వ్యాక్సినేషన్ ఉన్న వాళ్లనే తమ దేశంలోకి అనుమతిస్తుండటం వల్ల ఆ వ్యాక్సిన్ వేసుకుని జోకోవిచ్ ను హెూటల్ లో నిర్బంధించారు. కానీ అతడు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు.

# ఒలింపిక్స్ - భారత్ కీలక నిర్ణయం!!



2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్ ఆసక్తి ప్రదర్శిస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే తన ఆసక్తిని తెలుపుతూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి లేఖను కూడా రాసింది.

అయితే 2036 ఒలింపిక్ నిర్వహణ హక్కుల కోసం భారత్ మాత్రమే కాకుండా ఇండోనేసియా, మెక్సికో, పోలెండ్, తుర్కియే, దక్షిణ కొరియా, ఈజిప్ట్ కూడా పోటీ పడుతున్నాయి.

**అహ్మదాబాద్ ప్రధాన కేంద్రంగా**

భారత్ చివరి సారిగా 2010లో (కామన్వెల్త్ క్రీడలు) బహుళ క్రీడల టోర్నీకి ఆతిథ్యమిచ్చింది. అయితే ఈ సారి ఆసక్తి చూపినట్టుగానే, భారత్ బిడ్ గెలిస్తే, అహ్మదాబాద్‌లో ఈ విశ్వ క్రీడలను నిర్వహించాలన్నది మనోళ్ల ఆలోచన. ఎందుకంటే పెద్ద మొత్తంలో ఈవెంట్లను నిర్వహించడానికి అవసరమైన అత్యాధునిక వసతులు అక్కడ ఉన్నాయట.

ఒక్క అహ్మదాబాద్‌లోనే కాదు దేశంలోని వివిధ నగరాల్లోనూ ఈ ప్రతిష్టాత్మక పోటీలను నిర్వహించాలని భావిస్తోంది భారత్. దీనిపై ఇప్పటికే చర్చలు కూడా జరుగుతున్నాయి. పైగా ఖర్చును తగ్గించుకోవడం కోసం ఒలింపిక్స్ నిర్వహించే ఏ ఆతిథ్య దేశమైనా, ఈ విశ్వ క్రీడలను ఒకటి కన్నా ఎక్కువ నగరాల్లో నిర్వహించుకునేందుకు వీలు కల్పించింది అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ). 2014లోనే దీనికి ఆమోదం తెలిపింది.

**ఆ నగరమే ప్రధాన కేంద్రంగా**

మన దేశంలో ఉన్న క్రీడా సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్న ఉద్దేశంతోనే.. ఒకటి కన్నా ఎక్కువ నగరాల్లో నిర్వహించేందుకు భారత్ యోచిస్తోంది. ఒకవేళ నిజంగానే ఈ ప్రణాళిక అమలైతే, అహ్మదాబాద ప్రధాన కేంద్రంగానే ఆటలను నిర్వహిస్తారు. క్రీడా గ్రామాన్ని అక్కడే నిర్మిస్తారు.

**ప్రణాళిక అమలైతే ఇలా**

ఉదాహరణకు హాకీ కేంద్రంగా పేరున్న ఒడిశాలో అత్యధిక హాకీ మ్యాచ్‌లను ఆడించొచ్చు. రోయింగ్ ఈవెంట్లను భోపాల్‌లో, కనోయింగ్, కయాకింగ్‌లను పుణెలో నిర్వహించొచ్చు. ప్రస్తుతం క్రికెట్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్ వేదికలను పరిశీలిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వశాఖ మధ్య చర్చలు జరుగుతున్నాయని తెలిసింది. క్రికెట్ టోర్నీ కోసం ఢిల్లీ, ముంబయి, అహ్మదాబాద్ పోటీ పడుతున్నాయి. ఇండోర్ ఈవెంట్లను అత్యధికంగా అహ్మదాబాద్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే అవకాశముందట. కాగా, ఒలింపిక్స్ నిర్వహణకు సంబంధించి సమగ్ర ప్రణాళికను త్వరలోనే ఐసీసీకి సమర్పించనున్నారు మన అధికారులు. ఇక 2028 ఒలింపిక్స్‌కు లాస్‌ఏంజిలెస్, 2032 ఒలింపిక్స్‌కు బ్రిస్బేన్ ఆతిథ్యమివ్వనున్న సంగతి తెలిసిందే.

# 'క్రికెట్ లోనే అత్యధిక సూసైడ్ కేసులు'

### – మాజీ క్రికెటర్ సంచలన కామెంట్స్



గ్లోబల్ స్పోర్ట్స్ లో అత్యధిక సూసైడ్ రేట్ క్రికెట్ లోనే ఉందని సంచలన కామెంట్స్ చేశాడు టీమిండియా మాజీ బ్యాటర్ రాబిన్ ఉతప్ప. తాను కూడా గతంలో టీమ్ లో ఉన్న పోటీతత్వం వల్ల మానసిన ఒత్తిడిని తీవ్రంగా ఎదుర్కొన్నట్లు తెలిపాడు.

క్రికెట్ లో కేవలం ప్లేయర్స్ మాత్రమే కాదని, అంపైర్స్, బ్రాడ్ కాస్టర్స్ సహా పలు విభాగాలకు చెందిన సభ్యులు చాలా మంది ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించాడు.

"నాకు తెలిసింది ఈ నిజం చాలా తక్కువ మందికి తెలుసు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడల్లో క్రికెట్ లోనే అత్యధిక మరణాలు నమోదయ్యాయి. ఇది చాలా తక్కువ మందికి తెలిసిన నిజం. క్రికెట్ ఆడే ప్లేయర్స్ మాత్రమే కాదు ఈ క్రీడలో భాగమైన ఇతర సభ్యులు కూడా చాలా మంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. క్రికెట్ అనేది టీమ్ స్పోర్ట్ కన్నా ఇండివిడ్యువల్ స్పోర్ట్. ఎందుకంటే మ్యాచ్ లో మీరు, మీ ఓపెనర్ పార్ట్నర్ తో పోటీ పడుతున్నట్టే, జట్టు బయట ఉన్న మూడో ఓపెనర్ తోనూ పోటీపడాల్సి ఉంటుంది. అలా 10–15ఏళ్ల పాటు పోటీ పడాలనే మైండ్ సెట్ తో కెరీర్ ను కంటిన్యూస్ గా కొనసాగిస్తే, అది చివరికి మిమ్మల్ని అత్యంత చీకటి ప్రాంతంలోకి నెట్టేస్తుంది." అని పేర్కొన్నాడు.

తాను 2009 – 2011 మధ్య మానసిక సమస్యలను ఎదుర్కొన్నట్లు గుర్తుచేసుకున్నాడు రాబిన్ ఉతప్ప. ఆ సమస్య నుంచి తాను ఎలా బయటపడ్డాడో వివరించాడు. ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ గ్రహమ్ థోర్ప్, టీమిండియా మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్ బలవన్మరణానికి పాల్పడిన సంఘటనలను గుర్తుచేశాడు. జీవితం అలా ముగిసిపోకూడదని అన్నాడు. "2011లో నేనెందుకు మనిషిగా పుట్టానా అని సిగ్గుపడ్డాను. ఒకానొక దశలో నెక్స్ట్ ఏం చేయాలో తెలీక సతమతమవుతాం. నేను కూడా అంతే. కానీ ఆ తర్వాత దాని నుంచి బయటపడ్డాను." అని చెప్పుకొచ్చాడు.

కాగా, రాబిన్ ఉతప్ప తన తొమ్మిదేళ్ల కెరీర్ లో 59 వన్డే, టీ20 అంతర్జాతీయ మ్యాచులు ఆడాడు. అలానే సౌతాఫ్రికాలో 2007 టీ 20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

# సన్‌రైజర్స్ ఓటమి.. కావ్య పాపకు తప్పని గోస!



సౌతాఫ్రికా20 లీగ్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఘోర పరాజయంతో ప్రారంభించింది. ఎంఐ కేప్ టౌన్‌తో గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ 97 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది.

ఈ ఓటమితో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఓనర్ కావ్య మారన్ తీవ్ర నిరాశకు గురైంది.

వరుసగా గత రెండు సీజన్లలో విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఈ సారి మాత్రం పేలవ ఆరంభాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఐ కేప్‌టౌన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 174 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్ డేవాల్డ్ బ్రెవిస్(29 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 57) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. జార్జ్ లిండే(23 నాటౌట్), డెలానో(12 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 25 నాటౌట్) మెరుపులు మెరిపించారు.

సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ బౌలర్లలో మార్కో జాన్సెన్, రిచర్డ్ గ్లీసన్ రెండేసి వికెట్లు తీయగా.. బెయర్స్, లియమ్ డాసన్, సిమన్ హార్మర్ తలో వికెట్ తీసారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ అనూహ్యంగా 15 ఓవర్లలో 77 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్(19) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముగ్గురు బ్యాటర్లు డకౌటయ్యారు. డెలానో పోట్గీటర్(5/10) ఐదు వికెట్లతో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ పతనాన్ని శాసించాడు. ట్రెంట్ బౌల్ట్(2/16) రెండు వికెట్లు దక్కాయి. ఈ ఘోర పరాజయంతో సన్‌రైజర్స్ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ ఘోర ఓటమితో కావ్య మారన్ ఎంత బాధపడిందోనని కామెంట్ చేస్తున్నారు. పాపం కావ్య పాప.. తప్పని గోస అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. సన్‌రైజర్స్‌కు సంబంధించిన ప్రతీ మ్యాచ్‌కు హాజరయ్యే కావ్య మారన్.. ఈ ఆరంభ మ్యాచ్‌కు మాత్రం హాజరవ్వలేదు. అతిత్వరలోనే ఆమె సౌతాఫ్రికా గడ్డపై అడుగుపెట్టే అవకాశం ఉందని, ఆమె అక్కడికి వెళ్లిన తర్వాత టీమ్ పూర్వ వైభవం అందుకుంటుందని ఫ్యాన్స్ ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు. ఈ టోర్నీ భాగంగా నేడు డర్బన్ సూపర్ జెయింట్స్, ప్రిటోరియా క్యాపిటల్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్ రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. సన్‌రైజర్స్ తమ తదుపరి మ్యాచ్‌ను పార్ల రాయల్స్‌తో ఆడనుంది. శనివారం సాయంత్రం 4.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

# బ్యాట్ విరగొట్టి, తల బాదుకున్న వార్నర్! - ఏమైందంటే?



ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ వార్నర్ కు మ్యాచ్ ఆడుతుంటే అనుకోని సంఘటన చోటు చేసుకుంది. బ్యాటింగ్ కు దిగిన అతడు బ్యాట్ విరగొట్టి బంతితో తలను బాదుకున్నాడు.

దీనికి సంబంధించిన వీడియోను చూసిన క్రికెట్ అభిమానులు దాన్ని తెగ షేర్ చేస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఇంతకీ ఏ మ్యాచ్ లో ఈ సంఘటన జరిగిందంటే? ప్రస్తుతం వార్నర్ బీబీఎల్ 2024–25లో ఆడుతున్నాడు. సిడ్నీ థండర్ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. అయితే తాజాగా ఈ లీగ్ లో భాగంగా హెూబార్ట్ హరికేన్స్ తో సిడ్నీ థండర్ కు మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లోనే బరిలోకి దిగిన వార్నర్ కు బంతి తాకింది. రిలే మెరిడిత్ వేసిన నాలుగో ఓవర్ తొలి బంతికి ఈ ఘటన చోటు చేసుకుంది. రిలే మెరిడిత్ ఆఫ్ స్టంప్ లైన్ మీదుగా ఫుల్ డెలివరీ బౌల్ చేశాడు. దాన్ని వార్నర్ మిడ్ ఆన్ దిశగా స్ట్రైట్ గా బాదాడు. అయితే బాల్ తగలగానే బ్యాట్ స్పాట్ లోనే విరిగిపోయింది. అనంతరం బంతి గాల్లోకి ఎగిరి అతడి తలకు తాకింది. అదృష్టవశాత్తు వార్నర్ హెల్మెట్ ధరించడంతో ఆ బంతి హెల్మెట్ కు తగిలింది. దీంతో దెబ్బ తగలలేదు. దీంతో ఈ బాల్ కు వార్నర్ పరుగులేమీ చేయలేదు. దీనికి సంబంధించిన వీడియోను బీబీఎల్ తన అఫీషియల్ ఎక్స్ హ్యాండిల్ లో పోస్ట్ చేసింది. "డేవిడ వార్నర్ బ్యాట్ విరగొట్టి, తనంత తానే తల మీద కొట్టుకున్నాడు" అంటూ క్యాప్షన్ రాసుకొచ్చింది. దీనికి నవ్వుతున్న ఎమోజీని జత చేసింది. ఇది చూసిన క్రికెట్ అభిమానులు తెగ నవ్వుకుంటూ ఆ వీడియోను షేర్ చేస్తున్నారు. ఇక ఆ తర్వాత ఓవర్ లో రిలే వార్నర్ ఓపెనింగ్ పార్ట్నర్ సామ్ కొన్ స్టాస్ ను కూడా ఔట్ చేశాడు. షార్ట్ డెలివరీ వేశాడు. కొన్ స్టాస్ దాన్ని షాట్ బాదేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి నేరుగా వికెట్ కీపర్ మ్యాథ్యూ వేడ్ చేతికి చిక్కింది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**